సోషల్ మీడియా ప్రచారాలపై నిఘా

అవాస్తవాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు: ఎస్పీ రత్న



పుట్టపర్తిరూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా ప్రచారాలు, పోస్టులపై నిఘా పెట్టినట్లు ఎస్పీ రత్న తెలిపారు. అవాస్తవాలు ప్రచారం చేసినా, అసభ్యకర పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తప్పవని గురువారం ప్రకటనలో హెచ్చరించారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా, ఫొటోలు మార్ఫింగ్ చేసి పోస్టులు పెట్టినా, సున్నితమైన అంశాల్లో అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా వ్యవహరించినా అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అసభ్యకర పోస్టులు పెట్టే వారిపై సైబర్ సెల్ సోషల్ మీడియా విభాగంలో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అవాస్తవాలను ప్రసారం చేసే గ్రూపుల అడ్మిన్లపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

పర్యాటక శోభ

బుక్కపట్నం చెరువు వద్ద బోటింగ్ సౌకర్యం

నేడు ప్రారంభం



బోటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

7



విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సీఎం

విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన చంద్రబాబు

- గొల్లపల్లి వద్ద రూ.78.98 కోట్లతో ఏర్పాటు
- వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి
- హాజరైన మంత్రి సవిత, ఎంపీ బీకే



గొల్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

గోరంట్ల, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి వద్ద రూ.78.98 కోట్ల వ్యయంతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వర్చువల్ విధానం ద్వారా గురువారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి గొల్లపల్లి నుంచి బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖమంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారధి, కలెక్టర్ చేతన్, విద్యుత్ శాఖ ఎస్ఈ వరప్రసాద్ హాజరయ్యారు. గుంటూరు జిల్లా నుంచి పలు విద్యుత్ ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను సీఎం చేశారు. కార్యక్రమాన్ని గొల్లపల్లి సబ్‌స్టేషన్ నుంచి వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని మంత్రి సవిత ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో గోరంట్ల, చిలమత్తూరు, పుట్టపర్తి మండలాల్లో వ్యవసాయం, ఇళ్లు, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. లోఓల్టేజీ సమస్య ఉండదన్నారు. 2018లోనే చంద్రబాబు విద్యుత్ సంస్కరణల ద్వారా ఈ ప్రాంతానికి 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ అవసరమని దూరదృష్టితో గుర్తించారన్నారు. దీంతో ఈప్రాంతం పరిశ్రమల కారిడార్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. పంచాయతీల వారీగా ప్రజలకు అవగాహన కల్పించి, సోలార్ విద్యుదుత్పత్తికి కృషి చేస్తామన్నారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో ఉత్పత్తయిన సౌర, పవన విద్యుత్‌ను రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేయడానికి విద్యుత్ ఉపకేంద్రాన్ని నిర్మించారన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, తహసీల్దార్ మారుతి, విద్యుత్ శాఖ ఈఈలు భూపతి, శివరాముడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీ పోస్టులకు 55 మంది ఎంపిక



నియామక పత్రం అందజేస్తున్న డీఈఓ కిష్టప్ప

కొత్తచెరువు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయా (కేజీబీవీ)ల్లో 70 టీచర్ పోస్టులకు 55 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. వారికి బుక్కపట్నంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కిష్టప్ప గురువారం నియామక పత్రాలు అందజేశారు. 70 పోస్టులకు 66 మంది అభ్యర్థులు హాజరు కాగా.. వారిలో 55 మంది ఎంపికయ్యారన్నారు. ఇందులో కొంతమంది అభ్యర్థులు రెండు పోస్టులకు ఎంపిక కాగా.. వారి చాయిస్ మేరకు ఒక పోస్టు ఇచ్చామన్నారు. 8 మంది కౌన్సెలింగ్‌కు గైర్హాజరయ్యారన్నారు. మిగిలిన 15 పోస్టుల భర్తీ విషయాన్ని కలెక్టర్ దష్టికి తీసుకెళ్లి, వాటికి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఖాకీ మార్క్ ఏదీ..?



- వైసీపీతో అంటకాగిన వారికి పోస్టింగ్‌లు
- ప్రభుత్వం మారినా వైసీపీ సేవలోనే పలువురు పోలీసులు
- నేరచరితుల కదలికలపై కొరవడిన నిఘా
- ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యమే...
- దళిత యువకుడి ఆత్మహత్య కేసులో పోలీసు వైఫల్యంపై విమర్శలు

పుట్టపర్తి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలను కట్టడి చేయడంలో ఖాకీ మార్క్ కనిపించట్లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలు పోలీసుస్టేషన్లు అవినీతికి అడ్డాగా మారిపోయాయన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఠాణాలపై ఉన్నతాధికారుల నిఘా కొరవడడంతో స్టేషన్లలో ఆడిందే ఆటగా తయారైందన్న వాదనలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. కాసులు సమర్పించుకోనిదే కేసులు కట్టడంలేదని బాధితులు వాపోతున్నారు. ఇటీవల చిలమత్తూరు మండలంలో గ్యాంగ్‌రేప్ రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ కేసులో పట్టుబడిన నిందితులు పాత నేరస్తులు. వారికి గత ప్రభుత్వంలో కొందరు పోలీసులే సహకరించారని ఉన్నతాధికారుల విచారణలో తేలినట్లు సమాచారం. ముగ్గురు సిబ్బందిపై చర్యలు తీసుకోవడమే ఇందుకు నిదర్శనం. మరి కొంతమందిపై చర్యలకు ఉన్నతాధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మారినా కొందరు పోలీసులు ఓవైపు నేరస్తులతో చేతులు కలుపుతూ.. మరోవైపు వైసీపీ నేతల సేవలో తరిస్తున్నట్లు స్పష్టమైంది. బుక్కపట్నం మండలం మారాలలో వైసీపీ నాయకుల బెదిరింపులకు ఓ దళిత యువకుడు ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ రెండు ఘటనల్లో నిందితులను గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో అంటకాగిన పోలీసులు రక్షించే ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మారినా జిల్లాలో కొందరు పోలీసుల తీరు మారకపోవడంతో ఆ శాఖకు చెడ్డపేరు వస్తోందని ఆ వర్గాలు ఆవేదన చెందుతున్నాయి.

వారికే మళ్లీ పోస్టింగ్

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలీసులు అధికార పార్టీ సేవలో తరించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై ఉక్కుపాదం మోపడమే పోలీసుల పనిగా మారింది. నేరాల కట్టడిని గాలికొదిలేశారు. అప్పట్లో అధికార వైసీపీ నాయకుల మెప్పుకోసం ప్రతిపక్షాల నేతలు, కార్యకర్తలు, అమాయకులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి, బెదిరించేవారు. అక్రమ కేసులు బనాయించారు కూడా. కూటమి ప్రభుత్వం కొలువుదీరినా అప్పట్లో వైసీపీ సేవలో తరించిన వారే మళ్లీ పోస్టింగ్ తెచ్చుకున్నారు. నాలుగు రోజుల క్రితం ఎన్డీఏ జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో సైతం పలువురు ఎమ్మెల్యేలు, ఎన్డీఏ నేతలు.. జిల్లాలో పోలీసుల తీరు మారలేదనీ, రెడ్‌మార్క్ ఉన్న వారిని పార్టీలోని కొందరు నేతలు పోస్టింగ్ వేయించుకున్నారనీ, ఇది సరికాదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎదుట వాపోయారు. దీనిని బట్టి పోలీసుల పనితీరును అర్థం చేసుకోవచ్చు.

కొరవడిన నిఘా

జిల్లాలో రాత్రిపూట గస్తీ, నేరచరితులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పోలీసు నిఘా కొరవడిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల చాపకింద నీరులా గంజాయి, మట్కా, గుట్కా, పేకాట, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నేరనియంత్రణపై పోలీసులు పట్టు కోల్పోతున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ఇటీవలిగా జిల్లాలో జరుగుతున్న చోరీలు, మహిళలపై అఘాయిత్యాలు, హత్యలు పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. పోలీసుల అలసత్వంతో నేరస్థులు రెచ్చిపోతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ముందే స్పందించి ఉండుంటే..

బుక్కపట్నం మండలం మారాలకు చెందిన టీడీపీ కార్యకర్త నారాయణస్వామితోపాటు అతడి భార్య, కుమారుడిపై రెండు నెలల కిందట పీర్ల పండుగ సందర్భంగా అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ రామ్మోహన్ విచక్షణారహితంగా దాడి చేశాడు. అప్పట్లో నారాయణస్వామి బుక్కపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దుప్పటి పంచాయితీ చేసి, ఫిర్యాదుదారుడినే బెదిరించి, పంపేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నారాయణస్వామి ఈనెల 2న పోలీసు స్టేషన్‌కు వెళ్లాడు. అతడి కుమారుడు గౌతమ్ స్టేషన్‌కు వస్తుండగా మార్గమధ్యలో బుచ్చయ్యగారిపల్లి వద్ద వైసీపీ నాయకుడు రామ్మోహన్, మరో ముగ్గురు అడ్డగించారు. 'నీ తండ్రి ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలనీ, లేదంటే మీ కుటుంబాన్నే హతమారుస్తాం' అంటూ బెదిరించారు. భయాందోళన చెందిన గౌతమ్ పుట్టపర్తిలో పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకున్నాడు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. నారాయణస్వామి ఫిర్యాదు చేసిన రోజే పోలీసులు స్పందించి, కఠినంగా వ్యవహరించి ఉండుంటే యువకుడు ప్రాణాలతో ఉండేవాడన్న వాదనలు వినిపిస్తున్నాయి. పోలీసుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

రైతులపై ఫీల్డ్ అసిస్టెంట్ దుర్భాషలు



ఎంపీడీఓ కార్యాలయంలో రైతులపై చిందులేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

పెనుకొండ రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'నన్ను కాదని నేరుగా ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి బిల్లులు చేయమని అడుగుతారా.. మీకెందుకు పెట్టాలి రా.. బిల్లులు? ఎవరికి చెప్పుకుంటావో.. చెప్పుకో..' అంటూ రొద్దంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రైతులపై ఫీల్డ్ అసిస్టెంట్ రవి గురువారం నానా దుర్భాషలాడాడు. రొద్దం మండలం చోళేమర్రి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రవి.. రైతులను దుర్భాషలాడిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. చోళేమర్రిలో 2023 సంవత్సరానికిగాను ఉపాధి హామీ పథకం కింద ముగ్గురు రైతులు మామిడి మొక్కలు నాటుకున్నారు. అందుకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో రైతులు.. ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి అధికారులకు సమస్యను వివరించారు. అక్కడే ఉన్న చోళేమర్రి ఫీల్డ్ అసిస్టెంట్ రవి కలగజేసుకుని తనను కాదని బిల్లుల కోసం కార్యాలయానికి వస్తారా, ఎంత ధైర్యం అంటూ బూతుపురాణం అందుకున్నాడు. పత్రికలో రాయలేని భాషలో దుర్భాషలాడాడు. ఈ విషయంపై ఎంపీడీఓ రాంకుమార్‌ను అడగ్గా.. విషయం తన దృష్టికి రాలేదనీ, విచారణ చేస్తామన్నారు.

మద్యం షాపు ఏర్పాటును అడ్డుకున్న కూటమి నాయకులు



అడ్డుకునేందుకు వచ్చిన కూటమి నాయకులు, జనం

హిందూపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం బిందునగర్ వద్ద ఏర్పాటు చేస్తున్న మద్యం షాపు ఏర్పాటును కూటమి నాయకులు గురువారం అడ్డుకున్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో పరిగి మండలం షాపు నంబరు 58 లాటరీలో కర్ణాటకకు చెందిన విజయ్‌కు దక్కింది. అప్పటి నుంచి షాపు ఏర్పాటు చేయకుండా నియోజకవర్గానికి చెందిన ముఖ్యనేత అడ్డుపడుతున్నట్లు బాధితుడు విజయ్ పేర్కొన్నారు. గురువారం మద్యంషాపు ఏర్పాటు చేసేందుకు స్థలం శుభ్రం చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన కూటమి నాయకులు అడ్డుకున్నారు. పోలీసులకు విజయ్ ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రంగడు అక్కడకు చేరుకుని ఎక్సైజ్ అధికారులతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం షాపు అక్కడే ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పడంతో అడ్డుకోవడానికి వచ్చిన కూటమి నాయకులతోపాటు జనాన్ని పంపించేశారు. దీనిపై ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్యను వివరణ కోరగా.. నిబంధనల ప్రకారం అక్కడ మద్యంషాపు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. జనాన్ని ముందుపెట్టి కూటమి నాయకులు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని షాపు యజమాని ఆరోపించారు. అన్నిచోట్ల షాపులు ప్రారంభించి, 20రోజులు దాటినా ఇక్కడ మాత్రం అడ్డు తగులుతున్నారన్నారు. ఎట్టకేలకు షాపు ప్రారంభానికి స్థలం శుభ్రం చేశారు. శుక్రవారం షాపు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అత్యవసర ఆందోళన..!

- 108, 104 సిబ్బందికి అందని వేతనాలు
- మూడు నెలలుగా అప్పు చేసి పప్పుకూడు
- నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకున్న అరబిందో
- దిక్కుతోచని స్థితిలో బాధితులు
- ప్రభుత్వం ఆదుకోవాలని విన్నపం



అనంతపురం టౌన్/ధర్మవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉండేవారిని కాపాడటంలో కీలకంగా వ్యవహరిస్తున్న 108తోపాటు.. గ్రామీణ ప్రజల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్న 104 సిబ్బంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు నెలల నుంచి వీరికి వేతనాలు అందడం లేదు. వచ్చేది తక్కువ వేతనం. అదీ నెలనెలా అందడం లేదు. తాజాగా నిర్వహణ బాధ్యతల నుంచి అరబిందో సంస్థ తప్పుకోవడంతో బకాయి వేతనాలు వస్తాయో లేదోనని బాధితులు ఆందోళన చెందుతున్నారు. వేతనాలు రాకపోతే తమకు పూట గడవటం కష్టమౌతుందని,

(మిగతా 6లో..)

ఎవరి మాటా వినడు..!

పంచాయతీరాజ్‌లో మోనార్క్ జేఈ



"ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కిందిస్థాయి అధికారులు పనిచేయడం చూస్తుంటాం.. కానీ ఈ అధికారి ఎవరి మాటా వినడు.. ఎవరినీ లెక్కచేయడు.. ఏమన్నా అంటే ఎమ్మెల్యే మా బంధువు అంటాడు.. పైగా తాను యూనియన్ లీడర్‌నంటూ ఫోజు కొడతాడు.. పంచాయతీరాజ్ శాఖలో ఇంజనీర్‌గా పనిచేసే ఆయన అంటే కాంట్రాక్టర్లకు కూడా హడల్.. పైసలిస్తే తప్ప మెజర్‌మెంట్స్ కూడా ఇవ్వడు.."

ఉన్నతాధికారులను సైతం లెక్కచేయని వైనం

ఎక్కడ పనిచేసినా వివాదమే

మామూళ్లు ఇస్తేనే మెజర్‌మెంట్స్

ఎమ్మెల్యే బంధువునంటూ హల్‌చల్

అనంతపురం సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలోని ఓ ఇంజనీర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. అనంతపురం పీఆర్ సబ్ డివిజన్-2లో పనిచేస్తున్న ఆ జేఈ పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆ అధికారి ఇక్కడికి వచ్చాడు. రాగానే మోనార్క్‌లా వ్యవహరిస్తున్నాడు. ఉన్నతాధికారులను సైతం లెక్కచేయకుండా ఆ ప్రాంత ప్రజాప్రతినిధి తమ బంధువని, ఈఎన్‌సీ తనకు బాగా పరిచయమని, సుదీర్ఘకాలం యూనియన్ లీడర్‌గా పనిచేశానంటూ హల్‌చల్ చేస్తున్నాడు. పల్లెపండుగ పనుల్లో సైతం పలువురు కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. తమకు అనుకూలమైన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలని పైరవీలు చేస్తున్నాడని తెలుస్తోంది. గతంలో పెనుకొండ నియోజకవర్గంలో పనిచేసినప్పుడు కూడా పెద్దఎత్తున మామూళ్లకు పాల్పడటం.. సకాలంలో పనులు చేయించకపోవడం.. పైసలిస్తే తప్ప మెజర్‌మెంట్స్ చేయకపోవడం వివాదాస్పదమైంది. దీంతో ఆ ప్రాంత ప్రజాప్రతినిధి అక్కడి నుంచి బదిలీ చేయించారు. తర్వాత క్యూసీ విభాగానికి బదిలీ చేయగా రిపోర్ట్ కోసం వచ్చే కాంట్రాక్టర్లను సైతం పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేశాడనే ఆరోపణలు ఉన్నాయి. తోటి ఉద్యోగులతోనూ ఆయనకు విభేదాలు ఉన్నాయి. క్యూసీ నుంచి ఇటీవలే అనంతపురం పీఆర్ డివిజన్-2కి బదిలీ అయ్యారు. మళ్లీ అదే పంథాతో వ్యవహరిస్తున్నాడు.



అనంతపురం పీఆర్ఐ సబ్ డివిజన్-2 కార్యాలయం

మామూళ్లు ఇస్తేనే మెజర్‌మెంట్స్

కాంట్రాక్టర్ ప్రభుత్వ పనులు చేస్తే.. సదరు జేఈ దగ్గరుండి వాటిని పర్యవేక్షిస్తూ నాణ్యతతో పాటు కొలతలు పరిశీలించాల్సి ఉంటుంది. పని చేసిన తరువాత మెజర్‌మెంట్స్ తీసి బిల్లులు రికార్డు చేసి డీఈఈతో పాటు ఈఈకి సమర్పించాల్సి ఉంటుంది. ఇక్కడే అసలు కథ మొదలవుతుంది. కాంట్రాక్టర్ ఆయన వద్దకు వెళ్తే కాలయాపన చేస్తాడు. ముందుగానే పైసలిస్తే తప్ప మెజర్‌మెంట్స్ తీయడు, బిల్లు పెట్టడు.

ఎమ్మెల్యే బంధువునంటూ హల్‌చల్

బదిలీపై ఇక్కడికి రాగానే ఆయన తనదైన శైలిలో పైరవీలు మొదలుపెట్టాడు. ఇక్కడి డీఈఈపై కూడా అటు శాఖ పరంగా.. ఇటు స్థానిక ప్రజాప్రతినిధికి ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ప్రధానంగా సంబంధిత ఎమ్మెల్యే తమ బంధువు అని, తాను చెప్పిందే జరుగుతుందని హల్‌చల్ చేస్తున్నాడని ఆ సబ్ డివిజన్‌తో పాటు ఈఈ కార్యాలయంలోను జోరుగా చర్చ జరుగుతోంది. శింగనమల నియోజకవర్గానికి పల్లె పండుగ కింద రూ. 18.02 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టే పనులు తమ వర్గానికి చెందిన కాంట్రాక్టర్‌కు అప్పగించాలనే యోచనతో పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్లను కూడా బెదిరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఎమ్మెల్యే తమ బంధువు అని చెబుతుడడంతో కాంట్రాక్టర్లలోనూ ఆందోళన నెలకొంది. దీనివల్ల పల్లె పండుగ పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని సమాచారం.

ఫిర్యాదులు మా వరకు రాలేదు

జేఈ, ఆపై స్థాయి అధికారికి సంబంధించిన అంశాలపై మాకు ఫిర్యాదులు అందలేదు. గతంలో ఆరోపణలు ఉన్నట్లు తెలిసింది. ఆయన ఎక్కువ కాలం క్యూసీలో పనిచేశారు. ఫీల్డ్‌లో తక్కువగా చేశారు. జేఈ ఆపై స్థాయి అధికారి మధ్య ఏదైనా సమస్య ఉంటే పరిశీలించి పరిష్కరిస్తాం. ఉద్యోగులందరితో సమన్వయం చేసుకుని పల్లెపండుగ పనులను వేగవంతం చేస్తాం.

- జహీర్ అస్లాం, ఎస్ఈ, పంచాయతీ రాజ్‌శాఖ

ఉచిత న్యాయసేవలు వినియోగించుకోండి



మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్

అనంతపురం క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శాశ్వత లోక్ అదాలత్‌లో ఉచిత ప్రజాప్రయోజన న్యాయ సేవలు వినియోగించుకోవాలని శాశ్వత లోక్ అదాలత్ ధర్మాసనం చైర్మన్ శ్రీనివాసరావు అన్నారు. శాశ్వత లోక్ అదాలత్ గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇరుపక్షాల నడుమ రాజీ కుదిరితే ఇరుపక్షాల సమ్మతితో వివాదం పరిష్కారమవుతుందన్నారు. అప్పీల్‌కు ఆస్కారం లేని శాశ్వత పరిష్కారంగా పరిగణించబడుతుందన్నారు. కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్

రామగిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నతపాఠశాలలో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని రామగిరి పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి స్మార్ట్‌టీవీ, మూడు బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీధర్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. రామగిరికి చెందిన రమేశ్ ఉన్నతపాఠశాలలో పరీక్షలు జరిగే సమయంలో బెంచీలు సర్దడానికి వెళ్లి అక్కడ ఏమేమి ఉన్నాయో గమనించాడు. ఆదివారం వాచ్‌మన్ లేని సమయంలో పాఠశాలలోని స్మార్ట్ టీవీ, మూడు బస్తాల బియ్యాన్ని ఎత్తుకెళ్లాడు. ఆ బియ్యాన్ని గురువారం అమ్మడానికి వెళ్తుండగా పోలీసులు గమనించి విచారించారు. టీవీ, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.1.24లక్ష ఉంటుందన్నారు.

పోలీసుల అదుపులో వైసీపీ కార్యకర్త



సంజీవరెడ్డి

బెళుగుప్ప, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై అసభ్యకర పోస్టులు పెట్టిన నక్కలపల్లికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త సంజీవరెడ్డిని పుట్టపర్తి పోలీసులు బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. కారణమేమిటని గ్రామస్థులు ప్రశ్నించగా, సంజీవరెడ్డి పెట్టిన పోస్టులను పోలీసులు చూపించారు. తిరుపతిలో కేసు నమోదు కాగా, దర్యాప్తు కోసం అదుపులోకి తీసుకున్నారని స్థానిక పోలీసులు తెలిపారు.

పల్లె పండుగ పనులు సంక్రాంతికి పూర్తి చేయాలి

నాణ్యత తప్పనిసరి

ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చీఫ్ ఇంజనీర్ విజయకుమారి



పరిశీలిస్తున్న ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ చీఫ్ ఇంజనీర్ విజయ కుమారి

అనంతపురం సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ పనుల్లో ఏ మాత్రం అలసత్వం చేయకుండా సంక్రాంతి పండుగలోపు పూర్తి చేయాలని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చీఫ్ ఇంజనీర్ విజయకుమారి ఆదేశించారు. పంచాయతీ రాజ్‌శాఖ ఎస్ఈ కార్యాలయంలో ఆమె ఉమ్మడి జిల్లాల ఎస్ఈ, ఈఈలు, డీఈఈలు, జేఈఈలతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా జిల్లాల వారిగా పల్లె పండుగ పనుల పనితీరు, లక్ష్యం తదితర అంశాలపై ఆరా తీశారు. పల్లె పండుగ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని పెట్టుకుని బాధ్యతగా పనిచేయాలన్నారు. అనంతరం ఆమె ఎస్ఈ జహీర్‌అస్లాంతో తపోవనంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈ డీపీఆర్‌పి మురళి, ఈఈలు ప్రభాకర్‌రెడ్డి, మల్లికా ర్జునమూర్తి, డీఎల్ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

రెండో దశ క్రికెట్ పోటీలు ప్రారంభం



నాగసాయి చరణ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో రెండో దశ జిల్లా స్థాయి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-16 క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఏసీఏ సీ-ఏసీఏ ఏ జట్ల మధ్య పోటీ జరగగా మొదట బ్యాటింగ్ చేసిన ఏసీఏ-సీ జట్టు 50 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఏసీఏ-ఏ జట్టు బౌలర్లు ప్రకాష్, హేమచంద్ర చెరో మూడు వికెట్లు తీశారు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఏసీఏ-ఏ జట్టు 27 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. ఇందులో ఓంకార్ 60 పరుగులు చేశాడు. ఏసీఏ-సీ జట్టు 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. మరో మ్యాచ్‌లో టీం డీ-టీం బీ జట్ల మధ్య తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన టీం-బీ జట్టు 90 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 254 పరుగులు చేసింది. ఇందులో నాగసాయి చరణ్ 84 పరుగులు చేశాడు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి, ఏసీఏ సెలెక్షన్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సెలెక్టర్లు కోటా రెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఖనిజం టిప్పర్ సీజ్



డి.హీరేహాళ్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఓఎంసీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇనుప ఖనిజాన్ని తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు సీజ్ చేశారు. బళ్లారికి చెందిన టిప్పర్ యజమాని తిమ్మారెడ్డి, ఓబులాపురం వైసీపీ నాయకులు పంపాపతి, శంకరప్ప ఓఎంసీ నుంచి ఖనిజాన్ని తరలించబోయారని ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు. తమ సిబ్బందితో బుధవారం రాత్రి అక్కడికి వెళ్లి వారిని అరెస్టు చేశామని తెలిపారు. ముగ్గురు నిందితులు, టిప్పర్‌ను మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీన్నుంచి బయట పడేందుకు వైసీపీ నాయకులు పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారని తెలిసింది.

అత్యవసర ఆందోళన..!

(5వ పేజీ తరువాయి)

అలాంటిది వినాయకచవితి, దసరా, దీపావళి పండుగల సమయంలో కూడా వేతనాలు అందలేదని వాపోతున్నారు. కుటుంబ పోషణకు అప్పులు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వందలాది మంది..

ఉమ్మడి జిల్లాలో 104 వాహనాలు 36 వరకు, 108 వాహనాలు 66 వరకూ ఉన్నాయి. ఒక్కో వాహనానికి ఒక డ్రైవర్, ఒక డీఈఓ ఉన్నారు. 104 వాహనంలో సీనియర్ డ్రైవర్‌కు రూ.24 వేలు, జూనియర్ డ్రైవర్‌కు రూ.16 వేలు వేతనం ఇస్తున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.12 వేలు ఇస్తున్నారు. 108 వాహన డ్రైవర్‌కు రూ.16 వేల నుంచి రూ.26 వేల వరకు వేతనం ఇస్తున్నారు. రిలీవర్లతో కలుపుకుని ఈ రెండు వ్యవస్థల్లో 400 మంది వరకు సిబ్బంది ఉన్నారు. మూడునెలల నుంచి వేతనాలు అందకపోవడంతో కలెక్టర్, డీఎంహెచ్‌ఓ తదితర ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రాలను సమర్పిస్తున్నారు. కానీ స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అరిగిపోయిన 104 వాహనంటైర్లు

తప్పుకున్న అరబిందో

వైసీపీ ప్రభుత్వ హయాంలో 108, 104 వాహనాల నిర్వహణ బాధ్యతలను అరబిందో సంస్థ చూసేది. ఆ సంస్థపై ఆది నుంచి అనేక ఆరోపణలు వచ్చాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత వారి అక్రమాలపై ప్రత్యేక దృష్టిపెట్టింది. ఒక్కొక్కటి బయటకు తీస్తోంది. దీంతో కాంట్రాక్టు గడువు ఉండగానే.. నిర్వహణ బాధ్యతల నుంచి అరబిందో తప్పుకుంది. కూటమి ప్రభుత్వం ఆమోదించింది. దీంతో 108, 104 సిబ్బందిలో ఆందోళన మొదలైంది. బకాయి వేతనాలను అరబిందో ఇస్తుందా, రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందా తెలియడం లేదని బాధితులు వాపోతున్నారు. నెలనెలా వేతనాలను ఇవ్వకుండా అరబిందో సంస్థ తమను ఇబ్బంది పెట్టిందని, ఇప్పుడు తమను నట్టేట వదిలేసి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి బిల్లులు వస్తేనే వేతనాలు ఇస్తామని ఆ సంస్థ అంటోందని వాపోతున్నారు. అరబిందో స్థానంలో నిర్వహణ బాధ్యతలను మరొకరికి అప్పగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీంతో వేతన బకాయిలపై స్పష్టత ఇవ్వాలని, తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



వేతనాలు ఇప్పించండి అంటూ డీఎంహెచ్ఓకు వినతి పత్రం అందజేస్తున్న 104సిబ్బంది

అరకొర వేతనాలు..

శ్రీసత్యసాయి జిల్లాలో 104 వాహనాల్లో 74 మంది పనిచేస్తున్నారు. వీరిలో పైలెట్లు (డ్రైవర్లు) 35 మంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు 35 మంది, అదనపు సిబ్బంది నలుగురు ఉన్నారు. ఒక్కో 104 వాహనంలో ఇద్దరు పనిచేస్తున్నారు. నెలలో 26 రోజులు గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. కానీ పనికి తగ్గ వేతనం అందడం లేదు. పైలెట్లకు రూ.12,900, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.12,500 చెల్లిస్తున్నారు. స్లాబ్ ప్రకారం 2016 నుంచి పనిచేస్తున్న పైలెట్‌లకు రూ.22 వేలు వేతనం ఇవ్వాలి. కానీ పాత వేతనంతోనే సరిపెడుతున్నారు. జీఓ నంబర్ 7 ప్రకారం ఐదేళ్లగా పనిచేస్తున్న ప్రతి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి రూ.18,500 వేతనం ఇవ్వాలి. అమలు కావడం లేదు. 104 వాహనాల నిర్వహణ కూడా గాడి తప్పింది. టైర్లు అరిగిపోయినా పట్టించుకోలేదని, డీజిల్ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని సిబ్బంది అంటున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం..

108, 104 సిబ్బందికి వేతనాలు అందడం లేదని మాదృష్టికి వచ్చింది. వారికి జీతాలు ఇచ్చే బాధ్యత నిర్వహణ సంస్థదే. వైద్యశాఖ పరిధిలో ఉండదు. సమస్యను కలెక్టరు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం.

- డాక్టర్ ఈబీ దేవి, అనంతపురం డీఎంహెచ్ఓ

అప్పులు చేసి బతుకుతున్నాం..



మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. వినాయకచవితి, దసరా, దీపావళి పండుగల సమయంలోలైనా ఇస్తారని అనుకున్నాం. కానీ ఇవ్వలేదు. వడ్డీలకు అప్పులు తెచ్చి కుటుంబాలను సాకుతున్నాం. ఇప్పుడు అరబిందో సంస్థ తప్పుకుందని అంటున్నారు. మాకు బకాయి జీతాలు ఎవరిస్తారో అర్థంకావడం లేదు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

- సుబ్రమణ్యం, 104 ఉద్యోగుల సంఘం శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి

సమాన వేతనం ఇవ్వాలి..



రెండున్నరేళ్ల నుంచి డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాను. పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నాం. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం సమాన పనికి సమావేతనం ఇవ్వాలి. అదే మా డిమాండ్.

- సాయికుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సీకేపల్లి

పీహెచ్‌సీలకు అటాచ్ చేయాలి..



104 వాహనాల నిర్వహణను పీహెచ్‌సీలకు అటాచ్ చేయాలి. దీనివల్ల ఖర్చు తగ్గుతుంది. కాంట్రాక్టు ఇస్తే ఖర్చు ఎక్కువ అవుతుంది. ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. బకాయి వేతనాలను చెల్లించి మాకు న్యాయం చేయాలి.

- మోహన్‌బాబు, 104 ఉద్యోగుల సంఘం శ్రీసత్యసాయి జిల్లా ప్రధానకార్యదర్శి

ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యవర్గం ఎన్నిక



ప్రశాంతి జిల్లా సమాఖ్య నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి జిల్లా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గురువారం స్థానిక బుడ్డప్పనగర్‌లో ఉన్న ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. చిత్తూరు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుకన్య పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షురాలు పదవికి ఐదుగురు పోటీ పడగా సుశీల (రాప్తాడు-ఓసీ) 12 ఓట్లతో ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఇ.రాధమ్మ (కంబదూరు-ఎస్సీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్ష పదవికి ఐదుగురు పోటీ పడగా రామలక్ష్మి (శెట్టూరు-ఎస్సీ) 11 ఓట్లతో ఎన్నికయ్యారు. కోశాధికారిగా నలుగురు పోటీలో నిలవగా భాగ్యలక్ష్మి (బెళుగుప్ప-బీసీ) 12 ఓట్లతో గెలుపొందారు. సహాయ కార్యదర్శి పదవికి నలుగురు పోటీ పడగా ఎస్. పర్వీన్ (బీసీ) 14 ఓట్లతో ఎన్నికయ్యారు. ఏడాది పాటు సాగే ఈ కమిటీ జిల్లాలోని డ్వాక్రా సంఘాల మహిళల అభివృద్ధికి పని చేస్తుంది. ఇదివరకు ప్రశాంతి జిల్లా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు షేకున్‌బీ, రాధమ్మ, ఉపాధ్యక్షురాలు సుజాత, సహాయ కార్యదర్శి సుహాసిని, కోశాధికారి లలితను సన్మానించారు.

ఆవిష్కరణలతోనే భవిష్యత్తు

జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య



శిక్షణ పొందిన అధ్యాపకులతో రిజిస్ట్రార్ కృష్ణయ్య

అనంతపురం సెంట్రల్, నవబంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలపై దృష్టి పెట్టినప్పుడే విద్యార్థులు భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా రాణిస్తారని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య పేర్కొన్నారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో 'ఆధునిక కంప్యూటింగ్' అనే అంశంపై మూడురోజుల పాటు నిర్వహించిన సదస్సు గురువారం ముగిసింది. ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం అందించేలా అధ్యాపకులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం అధ్యాపకులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ ఎ.పి. శివకుమార్, ఆర్.రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, పరిశోధకులు ఉమామహేశ్వరరావు, రహ్మానుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

స్ర్కీనింగ్‌తోనే క్యాన్సర్ నివారణ

డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి.. వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ



క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ, వైద్యులు, సిబ్బంది

అనంతపురం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ప్రజలను పీడిస్తున్న క్యాన్సర్ నివారణ కేవలం స్ర్కీనింగ్‌తోనే సాధ్యమవుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి తెలిపారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా గురువారం వైద్యశాఖ ఆధ్వర్యంలో అనంతపురంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఈబీ దేవి జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. అక్కడి నుంచి నినాదాలు చేసుకుంటూ సప్తగిరి సర్కిల్ వరకుర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ క్యాన్సర్లు వివిధ రకాలుగా వ్యాపిస్తాయన్నారు. ప్రధానంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ, ముఖద్వార, నోటి క్యాన్సర్లు అత్యధికంగా వ్యాపిస్తున్నాయన్నారు. వీటిని ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్సలు తీసుకుంటే నయమవుతాయన్నారు. ప్రభుత్వం కూడా ప్రతి ఒక్కరికి స్ర్కీనింగ్ పరీక్షలు చేయించాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఈనెల14 నుంచి వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చి స్ర్కీనింగ్ పరీక్షలు చేస్తారని తెలిపారు. సుమారు 8నెలల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని, ప్రతి మహిళ తప్పనిసరిగా స్ర్కీనింగ్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు సుజాత, ఓబులు, మధుసూదన్, నిహారిక, ప్రశాంతి, నారాయణస్వామి, సుమన, సునీల్, శ్రీహర్ష, రాజేష్, మనీషా, గీతాంజలి, డెమోలు త్యాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పీఈటీ, క్రీడాకారిణి మృతి బాధాకరం : శాప్ చైర్మన్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో పీఈటీ రమేష్, అతడి కుమార్తె హాకీ క్రీడాకారిణి సాయిభవిత మృతి చెందడం అత్యంత బాధాకరమని ఏపీ రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఒకే కుటుంబంలో క్రీడారంగానికి చెందిన ఇద్దరి మరణం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

నేటి నుంచి చిన్నపిల్లల వైద్యుల సదస్సు

అనంతపురం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల వైద్యుల రాష్ట్ర సదస్సు శుక్రవారం నుంచి అనంతపురంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు డాక్టర్లు శ్రీకాంత్, పవన్, సుదీప్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలిరోజు జిల్లా ఆసుపత్రి, వైద్య కళాశాల, ఐఎంఏ హాల్, కేర్‌అండ్‌క్యూర్, సవేరా ఆసుపత్రులలో వర్క్‌షాపులు జరుగుతాయన్నారు. శని, ఆదివారాల్లో గుత్తిరోడ్డులోని శ్రీసెవెన్ కల్యాణ మండపంలో సదస్సులు ఉంటాయన్నారు. ఈ సదస్సుకు చెన్నైకు చెందిన డాక్టర్ తంగవేలు, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ శ్రీనివాసమూర్తి, బెంగళూరుకు చెందిన డాక్టర్లు అక్షయ్‌శెట్టి, ప్రతాప్‌చంద్ర హాజరవుతారని పేర్కొన్నారు. చిన్నపిల్లల వైద్య రంగంలో కొత్త సాంకేతిక విధానాల గురించి చర్చిస్తామని వెల్లడించారు.

ఘనంగా సుబ్రహ్మణేశ్వర స్వామి కల్యాణం





అలంకరణలో సుబ్రహ్మణేశ్వర స్వామి, కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

ఆత్మకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వల్లి, దేవసేన సమేత స్వామివారికి అర్చకులు ఘనంగా కల్యాణం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ బాబు భక్తులు పాల్గొన్నారు.

రోస్టర్ తారుమారు

పీజీటీ కెమిస్ట్రీ బాధితుల గగ్గోలు

అనంతపురం విద్య, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పోస్టుల భర్తీలో రోస్టర్‌ను తారుమారు చేసి అర్హులకు అన్యాయం చేస్తున్నారంటూ బాధితులు వాపోతున్నారు. నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు ఒక రోస్టర్ చూపించి, పోస్టుల భర్తీ సమయంలో పాత రోస్టర్ అమలు చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పీజీటీ కెమిస్ట్రీ సబ్జెక్టుకు సంబంధించి నాలుగు పోస్టులుంటే నోటిఫికేషన్‌లో ఓసీ 2, ఎస్సీ, బీసీ-ఏ, రోస్టర్లను చూపారు. పోస్టుల భర్తీ సమయంలో అసలు బీసీ-ఏ రోస్టర్ లేదంటూ ఆ కేటగిరీ అభ్యర్థులు వాపోతున్నారు. ఇతర కేటగిరీల అభ్యర్థులకు సైతం అన్యాయం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఏపీసీ నాగరాజును వివరణ కోరగా... ఎస్పీడీ నుంచి వచ్చిన జాబితాల మేరకు అర్హుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించామని, పారదర్శకంగా పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు.

61 మందికి అంగన్‌వాడీ నియామక ఉత్తర్వులు

అనంతపురం విద్య, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో 61 మంది అభ్యర్థులకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల నియామక ఉత్తర్వులిచ్చినట్టు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్ పోస్టులు తొమ్మిదింటిలో నలుగురికి, మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులు నాలుగు ఉండగా ఇద్దరికి, హెల్పర్ పోస్టులు 71 ఉండగా 54 మందిని ఎంపిక చేసినట్టు తెలిపారు. అన్ని ప్రాజక్టుల్లోని సీడీపీఓలు అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేశారని పీడీ పేర్కొన్నారు.

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ.30

అనంతపురం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 1020 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.24, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురంరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.32వేలు, కనిష్ఠంగా రూ.12వేలు, సరాసరి రూ.22వేలుతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 65 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

1056 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 1056 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే అవుట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ 2కు 1039 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.642 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

10న స్ర్కీనింగ్ టెస్ట్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ స్ర్కీనింగ్ పరీక్ష ఈనెల 10న నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి తెలిపారు. హాల్ టిక్కెట్లు jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడు చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రానికి హాల్ టిక్కెటు తోపాటు ఆధార్, పాన్, ఓటర్‌కార్డు, పాసుపోర్టులలో ఏదో ఒకటి తీసుకొని వెళ్లాలన్నారు. రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకువెళ్లాలన్నారు. వివరాలకు 9440027718, 9963296433 నెంబర్లను సంప్రదించాలన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


మెడల్‌తో సంహిత

అనంతపురం సెంట్రల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సాఫ్ట్ టెన్నిస్ క్రీడా పోటీలకు ఎస్కేయూ క్యాంపస్ సెంట్రల్ స్కూల్ విద్యార్థి సంహిత ఎంపియ్యారు. ఈనెల 3, 4న పులివెందులలో నిర్వహించిన ఏపీ స్కూల్ గేమ్స్ అండర్-14 సాఫ్టటెన్నిస్ పోటీల్లో సంహిత ప్రతిభను ప్రదర్శించి జాతీయ పోటీలకు ఎంపికయినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సుగణమ్మ పేర్కొన్నారు. వచ్చేనెల మధ్యప్రదేశ్‌లో నిర్వహించే పోటీల్లో సంహిత పాల్గొంటారని తెలిపారు.

ఉపాధి కల్పించడమే లక్ష్యం
సంభవ్ ఫౌండేషన్ ప్రతినిధులు

అనంతపురం క్లాక్‌టవర్/సెంట్రల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని సంభవ్‌ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో గురువారం సంభవ్ ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి వివిధ ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కియ సంస్థ ప్రతినిధులు కబ్‌డాంగ్లీ, యాంగ్ గిల్మ, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శశాంక్‌మౌళి, శ్రీరాములు నాయక్, ఎస్‌వీబీటీ ప్రిన్సిపాల్ సుధాకర్, సంభవ్ ఫౌండేషన్ ప్రతినిధులు గిరిధర్, అనిల్ కుమార్, రవిశంకర్, కంచన్ మేవర శ్రీజ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను వేధించడం తగదు: ఎస్టీయూ

బ్రహ్మసముద్రం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల శిక్షణల పేరుతో బోధనకు దూరం చేస్తూ ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టడం తగదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పిల్లలపల్లి, వేపులపర్తి ఉన్నత పాఠశాలలతో పాటు నాగిరెడ్డిపల్లి, గొంచిరెడ్డిపల్లి, భైరసముద్రం ప్రాథమికోన్నత పాఠశాలలు, గోవిందయ్య దొడ్డి, ఎర్ర కొండాపురం ప్రాథమిక పాఠశాలల్లో గురువారం వారు ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తూ బోధనేతర పనులు అప్పగిస్తూ గత ప్రభుత్వం చేసిన తప్పిదాలే చేస్తోందని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ ఐడీలు సృష్టించమని ఒక వైపు చెబుతూనే.. మరోవైపు ఆధార్ అప్‌డేషన్ చేయించమని, పదో తరగతి విద్యార్థులకు నామినల్ రోల్స్ తయారు చేయమని, నవంబరు 14న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించాలని ఒత్తిడి తెస్తుండడం దారుణమన్నారు. ఉపాధ్యాయులకు తీవ్ర మానసిక ఒత్తిడితో కూడిన కార్యక్రమాలకు దూరం చేయాలని, ప్రశాంతమైన వాతావరణంలో విద్యాబోధన కొనసాగే పరిస్థితులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరెడ్డి, చంద్రశేఖర్, అర్చన తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక శోభ

- బుక్కపట్నం చెరువు వద్ద బోటింగ్ సౌకర్యం
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే


బుక్కపట్నం చెరువు

బుక్కపట్నం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): రాయలసీమలోనే అతి పెద్ద చెరువైన బుక్కపట్నం చెరువు పర్యాటక శోభ సంతరించుకోనుంది. ఈ ప్రాంత ఎన్నో ఏళ్ల కళ బోటింగ్ శుక్రవారం నెరవేరబోతోంది. చెరువు వద్ద బోటింగ్‌ను ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో స్పీడ్ బోటుతో పాటు సైక్లింగ్ బోట్లు ఏర్పాటు చేశారు. వీటిలో బుక్కపట్నం చెరువులో విహరించవచ్చు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ బోటింగ్‌ను ప్రారంభించనున్నారు. బుక్కపట్నం చెరువులో బోటింగ్ అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకున్న పాపాన పోలేదు..

బుక్కపట్నం చెరువు రాయలసీమలోనే అతిపెద్దది. చెరువు వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గత టీడీపీ హయాంలోనే భావించారు. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో అవన్నీ అటకెక్కాయి. కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఐదు నెలల్లోనే చెరువు వద్ద అభివృద్ధి పనులు చేపట్టారు. పర్యాటకాభివృద్ధికి శ్రీకారం చుట్టారు. బోటింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తేవడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జిల్లా వ్యాప్తంగా పర్యాటకాభివృద్ధి

జిల్లావ్యాప్తంగా పలు చెరువులు, రిజర్వాయర్ల వద్ద బోటింగ్ సౌకర్యం కల్పిస్తున్నాం. బుక్కపట్నం చెరువు వద్ద మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం. అందుకు అవకాశాలను పరిశీలిస్తున్నాం.

- ప్రతాప్‌రెడ్డి, జిల్లా మేనేజర్, పర్యాటక శాఖ



బోటింగ్ ఏర్పాటు ఆనందదాయకం

బుక్కపట్నం చెరువులో బోటింగ్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. గత వైసీపీ పాలనలో బుక్కపట్నం చెరువును పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే చెరువు అభివృద్ధికి చర్యలు చేపట్టడం హర్షణీయం.

- సతీష్, బుక్కపట్నం

కన్నీటి సంద్రం..

ఉన్నత స్థాయికి చేరాలని కుమార్తె..
బిడ్డను గొప్ప క్రీడాకారిణిగా చూడాలని తండ్రి..
కలలు కన్నారు.. ఎంతో కష్టపడ్డారు..
వారి లక్ష్యం చేరువవుతోంది..
ఇంతలోనే తండ్రి, బిడ్డను విధి వంచించింది..
రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది..
ఆశయ సాధనలో
ఇద్దరూ అసువులు బాశారు..
గంటల వ్యవధిలో కన్నుమూసి..
కుటుంబీకులను
కన్నీటి సంద్రంలో ముంచారు..

- ఆశయ సాధనలో అసువులు బాసిన తండ్రి, కుమార్తె
- గుట్టూరు వద్ద రోడ్డు ప్రమాదంలో పీఈటీ రమేష్ కూడా మృతి
- కూతురు మరణించిన గంటల్లోపే కన్నుమూత
- కన్నీటి పర్యంతమైన కుటుంబీకులు, బంధువులు

క్రైం కార్నర్


పీఈటీ రమేష్ భార్య మల్లికను ఓదార్చుతున్న మంత్రి సవిత


రమేష్ (ఫైల్)


విద్యార్థిని సాయిభవిత

ధర్మవరం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ మండలం గుట్టూరు వద్ద ఈనెల 6వ తేదీన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పీఈటీ రమేష్ చికిత్స పొందుతూ రాత్రి మరణించాడు. ఇదే ప్రమాదంలో ఆయన కూతురు సాయిభవిత 6న మధ్యాహ్న మరణించింది. గంటల వ్యవధిలో తండ్రి కూడా కన్నుమూశారు. అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన చనిపోయారు. తండ్రి, కుమార్తె మృతితో వారి కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. స్వగ్రామమైన ధర్మవరంలోని శివరాంనగర్‌కు మృతదేహాలను గురువారం తీసుకురావడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వారి మృతదేహాలను చూసి పీఈటీ భార్య మల్లిక గుండెలవిసేలా విలపించారు. అయ్యో.. దేవుడా.. అంటూ గుండెలు బాదుకుంది.

సంబరాల వేళ ప్రమాదం

ధర్మవరం పట్టణం శివరాంనగర్‌కు చెందిన రమేష్ రొద్దం ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తూ పెనుకొండలో నివాసముంటుండేవారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. పెద్దమ్మాయి సాయిభవిత పెనుకొండలోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతుండేది. ఈనెల 2న నెల్లూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. నెల్లూరు నుంచి బుధవారం రైలులో ధర్మవరం చేరుకుంది. తండ్రి రమేష్.. కుమార్తెను ద్విచక్రవాహనంలో తీసుకుని పెనుకొండకు బయల్దేరాడు. గుట్టూరు వద్ద బొలెరో వాహనం ఢీకొట్టడంతో తండ్రి, కుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. సాయిభవితను బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. రమేష్‌ను అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రికి మృతిచెందారు. ఇరువురి మృతదేహాలను స్వగ్రామమైన ధర్మవరానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న బంధువులు, తోటి ఉపాధ్యాయులు, ప్రజలు అక్కడికి చేరుకుని తండ్రి, కుమార్తె మృతదేహాలకు నివాళులర్పించారు. కుమార్తెను స్పోర్ట్స్ కోటా కింద డాక్టర్‌ను చేయాలని రమేష్ కలలు కనేవారని తోటి ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

కుటుంబానికి అండగా ఉంటాం : మంత్రి సవిత

తండ్రి, కుమార్తె మృతిచెందిన విషయం తెలుసుకున్న మంత్రి సవిత ధర్మవరం చేరుకున్నారు. తండ్రి, కుమార్తె మృతదేహాల వద్ద నివాళులర్పించారు. రమేశ్ భార్య మల్లికను ఓదార్చారు. అధైర్యపడవద్దనీ, ప్రభుత్వం తరఫున న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.రమేష్ భార్య మల్లికను మంత్రి సత్యకుమార్ యాదవ్ ఫోన్‌లో పరామర్శించి, ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కార్మికుడి మృతి


రమేష్‌నాయక్ (ఫైల్)

తాడిపత్రి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామసమీపంలో గల ఒక గ్రానైట్ ఫ్యాక్టరీలో గ్రానైట్‌గుండు తగలడంతో కార్మికుడు రమేష్‌నాయక్ (36) మృతి చెందినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం తులసీనాయక్ తండాకు చెందిన రమేష్‌నాయక్ ఉపాధి కోసం ఆరేళ్ల క్రితం తాడిపత్రికి వలసవచ్చాడు. ఇక్కడ ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. కాగా బుధవారం రాత్రి గ్రానైట్‌గుండు కటింగ్ చేస్తుండగా.. మిషన్ నిలిచిపోవడంతో జాకీ సాయంతో గుండును ఎత్తేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో గ్రానైట్ గుండు రమేష్‌నాయక్ ఛాతీ భాగంలో బలంగా తగలడంతో స్పృహకోల్పోయాడు. తోటి కార్మికులు వెంటనే చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య వీరమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బలి తీసుకున్న బెదిరింపులు

- వైసీపీ బెదిరింపులకు జడిసిన దళిత యువకుడు
- ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న వైనం
- చికిత్స పొందుతూ మృతి
- స్వగ్రామానికి మృతదేహం
- కన్నీటి పర్యంతమైన కుటుంబీకులు


గౌతమ్ మృతదేహంపై పడి విలపిస్తున్న బంధువులు

బుక్కపట్నం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఓ దళిత యువకుడిని పొట్టన బెట్టుకున్నారు. బెదిరింపులతో ఆ యువకుడిని బుగ్గి చేశారు. వేధింపులు, బెదిరింపులతో ఆత్మహత్య చేసుకునేలా చేశారు. వైసీపీ నాయకుల బెదిరింపులకు భయపడి పుట్టపర్తిలో దళిత యువకుడు గౌతమ్ (35) నాలుగు రోజుల క్రితం ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పటించుకున్నాడు. అతడిని బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించాడు. గురువారం పోస్టుమార్టం నిర్వహించి, స్వగ్రామమైన మండలంలోని మారాలకు తీసుకొచ్చారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బెదిరించి..

మారాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నారాయణస్వామితోపాటు అతడి భార్య, కుమారుడు గౌతమ్‌పై రెండు నెలల కిందట పీర్ల పండుగ సందర్భంగా అదే ఊరికి చెందిన వైసీపీ నాయకుడు, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ రామ్మోహన్ విచక్షణారహితంగా దాడి చేశాడు. అప్పట్లో నారాయణస్వామి బుక్కపట్నం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు.. దప్పటి పంచాయితీ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే విషయంపై నారాయణస్వామి ఈనెల 2న పోలీసు స్టేషన్‌కు వెళ్లాడు అతడి కుమారుడు గౌతమ్ స్టేషన్‌కు వస్తుండగా మార్గమధ్యలో బుచ్చయ్యగారిపల్లి వద్ద వైసీపీ నాయకుడు రామ్మోహన్‌తో పాటు మరో ముగ్గురు అడ్డగించారు. 'నీ తండ్రి ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలనీ, లేదంటే మీ కుంటుబాన్నే హతమారుస్తామ'ని బెదిరించారు. భయాందోళన చెందిన గౌతమ్ పుట్టపర్తిలో తాము నివాసముంటున్న తాత్కాలిక ఇంటి వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకన్నాడు. చికిత్స పొందుతూ మరణించాడు.

అన్నివిధాలా ఆదుకుంటాం

గౌతమ్ మృతదేహాన్ని గురువారం రాత్రి మారాలకు తీసుకురావడంతో కుటుంబీకులు, బంధువులు బోరున విలపించారు. గౌతమ్ మృతదేహానికి మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి తనయుడు పల్లె వెంకటక్రిష్ణకిషోర్‌రెడ్డి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. గౌతమ్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రూ.25వేలు ఆర్థికసాయం అందించారు.

దళిత యువకుడి ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు

పరారీలో కీలక నిందితుడు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

పుట్టపర్తిరూరల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం మండలం మారాల గ్రామానికి చెందిన దళిత యువకుడు గౌతమ్ (21) ఆత్మహత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కేసులో కీలక నిందితుడు రామ్మోహన్ పరారీలు ఉన్నాడన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. మారాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మేకల నారాయణస్వామి బతుకుదెరువు కోసం 8 ఏళ్ల క్రితం పుట్టపర్తికి వచ్చాడు. అతడి కుమారుడు గౌతమ్ ఇంటర్మీడియట్ వరకు చదువుకుని, బెంగళూరులో డెలివరీబాయ్‌గా పనిచేస్తుండేవాడు. నాలుగు నెలల క్రితం మొహరం పండుగకు నారాయణస్వామి కుటుంబంతో మారాల గ్రామానికి వెళ్లాడు. ఇతడు టీడీపీ కార్యకర్త. పండుగ సందర్భంగా ట్రాక్టర్‌ను నారాయణస్వామి గ్రామంలోని వైసీపీ నాయకుడు ఏదులపల్లి రామ్మోహన్ ఇంటిముందు వేగంగా నడిపాడని అతడి కుటుంబ సభ్యులు కొట్టారు. దీనిపై అప్పట్లో బుక్కపట్నం పోలీసుస్టేషన్‌లో నారాయణస్వామి ఫిర్యాదు చేశారు. ఈనెల 2వ తేదీన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి బుక్కపట్నం పోలీసుస్టేషన్‌కు వెళ్లి, కేసు విషయమై ఎస్‌ఐ కృష్ణమూర్తిని ఆరాతీశాడు. తనపై దాడిచేసిన వారిని స్టేషన్‌కు పిలిపించి, న్యాయం చేయాలని కోరాడు. అదే రోజు సాయంత్రం నారాయణస్వామి కుమారుడు గౌతమ్ తన మోటారుసైకిల్‌పై బుక్కపట్నం వస్తుండగా సచివాలయం వద్ద మారాలకు చెందిన రామ్మోహన్, సన్నరాముడు, గోపి, ప్రసాద్ అడ్డుకున్నారు. 'మాపైనే ఫిర్యాదు చేస్తారా.. చంపితే మీకు దిక్కెవరు? మీరేమీ చేసుకోలేరు, మీ బతుకులెందుకు రా.. ఆత్మహత్య చేసుకుని చావాల'ని దూషించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన గౌతమ్ పుట్టపర్తికి వస్తూ దారి మధ్యలో పెట్రోల్ కొనుక్కుని, ఇంటికి చేరుకున్నాడు. తండ్రికి జరిగిన అవమానాన్ని తలచుకుని తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. రామ్మోహన్ తదితరులు తన కుటుంబాన్ని హతమారుస్తారన్న భయంతో ఒంటిపై పెట్రోల్‌పోసుకుని, నిప్పటించుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే పుట్టపర్తి సత్యసాయి జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. అందులో భాగంగా నిందితులు సన్నరాముడు, గోపి, ప్రసాద్‌ను గురువారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ కేసులో కీలక నిందితుడు రామ్మోహన్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని వివరించారు. సమావేశంలో పుట్టపర్తి అర్బన్ సీఐ సునీత, బుక్కపట్నం ఎస్‌ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ ఇంజనీర్లపై విచారణ

పెనుకొండ-ముదిగుబ్బ-దొరిగల్లు పనుల్లో అక్రమాలు

కలికిరి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): గతంలో కడప ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేసి రిటైరైన రవీంద్రబాబుపై విచారణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రవీంద్రబాబుతోపాటు అదే సమయంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పనిచేసిన మరో 8 మంది ఇంజనీర్లపై కూడా ప్రభుత్వం బుధవారం విచారణకు ఆదేశించింది. ఆ జిల్లాలోని పెనుగొండ-ముదిగుబ్బ-దొరిగల్లు మధ్య 28వ కి.మీ, నుంచి 68వ కిలోమీటరు వరకు జరిగిన రోడ్డు విస్తరణ పనుల్లో అనేక అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో వెల్లడైంది. రిటైరైన కడప ఆర్‌అండ్‌బీ ఈఈ రవీంద్రబాబుతోపాటు ఆ రోడ్డు పనులు పర్యవేక్షించిన మరో ఎనిమిది మంది ఇంజనీర్లు వివిధరకాల అక్రమాలకు పాల్పడినట్లు విజిలెన్స్ తేల్చింది. రవీంద్రబాబు సహా ఈ రహదారి విస్తరణ పనులను పర్యవేక్షించిన ప్రస్తుతం బద్వేలు డీఈఈగా పనిచేస్తున్న బి.ఎస్.సలీమ్, అనంతపురం డీఈఈగా ఉన్న ఎస్.బాలకాటమయ్య, కళ్యాణదుర్గం ఈఈ రాజగోపాల్, కల్యాణదుర్గం డీఈఈ జి.వెంకటసుబ్బయ్య, పెనుగొండ ఏఈఈ ఎ.వెంకటేష్, విజయవాడ ఎయిర్‌పోర్ట్ అథారిటీ డీఈఈ డి.పద్మజ, ధర్మవరం ఏఈ ఆర్.రవీంద్ర, విజయవాడ ఎన్‌హెచ్ ఈఈ జి.సంజీవరాయుడులపై విజిలెన్స్ అధికారులు పలు అభియోగాలను నమోదు చేశారు. వీరంతా కుమ్మక్కై రహదారి పనుల్లో అనేక రకాల అక్రమాలకు పాల్పడ్డట్టు నిర్ధారించింది. ఈ తొమ్మిది మంది ఇంజనీర్లపై తగు చర్యలు తీసుకోవాలని సిఫారసు చేస్తూ 2023 మార్చి 20వ తేదీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అప్పటి ప్రభుత్వం విజిలెన్స్ సిఫారసులకు సంబంధించిన నివేదికపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా పక్కన పెట్టింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఈ నివేదికను వెలికితీసి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకొనేందుకు విచారణకు ఆదేశించింది. ప్రాథమికంగా విజిలెన్స్ గుర్తించి ప్రస్తావించిన వైఫల్యాలపై తగిన వివరణలు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. వీరి అక్రమాల చిట్టా గురించి విడివిడిగా నాలుగు అనుబంధాల్లో వివరిస్తూ సంజాయిషీలు పంపుకోవడానికి 10 రోజుల గడువిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్‌దండే వేర్వేరుగా పది జీవోలను బుధవారం విడుదల చేశారు. కడప ఈఈ రవీంద్రబాబు రిటైర్ అయినందున పెన్షన్ రూల్స్ మేరకు చర్యలు తీసుకోవాలని మరో జీవోలో ఆదేశించారు.

బెదిరించిన వ్యక్తి అరెస్టు

అనంతపురం క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): డబ్బు కోసం ఎవరైనా తన వద్దకు వస్తే నరుకుతానని వేటకొడవలితో బెదిరించిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ తెలిపిన మేరకు... ఉమామహేశ్వర్‌రెడ్డి బెంగళూరులో సెటిల్మెంట్లు చేసేవాడు. ఈక్రమంలో కొందరితో డబ్బు తీసుకుని సెటిల్మెంట్లు చేయకుండా, డబ్బు తిరిగి ఇవ్వకుండా అనంతపురంలో వివిధ ప్రాంతాల్లో ఉంటూ తప్పించుకు తిరిగేవాడు. తాజాగా కొందరు బెంగళూరు నుంచి వచ్చి డబ్బు అడిగారు. ఈ క్రమంలో త్వరలో ఇస్తానని నమ్మబలికాడు. డబ్బు పేరుతో పిలిపించి కొన్నిరోజుల కిందట ఒకరిపై దాడి చేయడంతోపాటు ఎవరైనా వస్తే భయభ్రాంతులను చేయాలనే ఉద్దేశంతో వేటకొడవలిని పెట్టుకుని ఉండేవాడు. సమాచారం అందుకున్న సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్, ఎస్‌ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి జేఎన్‌టీయూ రోడ్డులో అరెస్ట్ చేసి వేటకొడవలిని స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు పంపారు. ఇతడిపై వన్‌టౌన్, ఆత్మకూరు, రామగిరి పోలీస్‌స్టేషన్లలోని కేసులు ఉన్నట్లు తెలిపారు. గతంలో సెటిల్మెంట్ల వ్యవహారంలో వన్‌టౌన్ స్టేషన్‌లోని ఓ కేసులో జైలుకెళ్లొచ్చాడు.

బాలికల చాంపియన్.. అనంత

ఉంగుటూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం హైస్కూలులో నిర్వహించిన స్కూల్ గేమ్స్ అండర్-14 అథ్లెటిక్స్‌లో అనంతపురం జిల్లా బాలికలు సత్తాచాటారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. బాల, బాలికల అథెటిక్స్ పోటీలు గురువారం ముగిశాయి. పోటీలు కైకరం, నారాయణపురం చింతలపాటి బాపిరాజు స్టేడియంలో జరిగాయి. బాలికల చాంపియన్‌గా అనంతపురం జిల్లా జట్టు నిలిచింది. బాలుర చాంపియన్‌గా కడప జిల్లా జట్టు అవతరించింది. విజేతలకు పోటీల రాష్ట్ర పరిశీలకుడు ప్రసాదరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అలివేలు, అధ్యక్షుడు ప్రసాదరావు బహుమతులు అందజేశారు.


ట్రోఫీ అందుకుంటున్న అనంతపురం జిల్లా అథ్లెట్

మాతాశిశు మరణాలను తగ్గించేందుకు ప్రణాళికలు: కలెక్టర్


మందులు నిల్వ చేసే ఫ్రిజ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, డీఎంహెచ్‌ఓ

కూడేరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : మాతా శిశు మరణాలను తగ్గించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేసుకోవడంతో పాటు ప్రజారోగ్యం కాపాడడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మోడల్ పీహెచ్‌సీ గా ఎంపిక చేయడంతో గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ ఈబీ దేవితో కలిసి పీహెచ్‌సీలోని ప్రతి విభాగాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 45 పీహెచ్‌సీ, 25 అర్బన్ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు కొద్దిరోజులు జిల్లా కేంద్రంలోనున్న కాన్పుల విభాగంలో పనిచేయాలన్నారు. దీంతో కాన్పులు చేయడంలో మరింత అవగాహన పెరుగుతుందని చెప్పారు. సోమవారం నుంచి పీహెచ్‌సీ వైద్యులకు జీజీహెచ్‌లోని కాన్పుల వార్డులో శిక్షణ ప్రారంభించాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీనారాయణ, సౌమ్యరెడ్డి, తహసీల్దారు మహబూబ్ బాషా, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.
108 వాహనాల పనితీరుపై ఆరా.. కూడేరులోని 108 వాహనాల పనితీరుపై కలెక్టర్ వాటి డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. డీజిల్ లేక వాహనాలను నిలిపివేశామని డ్రైవర్లు చెప్పారు. ఇక స్థానికంగా రెండు తాగునీటి ట్యాంకులు దెబ్బతిన్నాయనీ, సమస్య తీర్చాలని సర్పంచ్ లలితమ్మ కలెక్టర్‌ను కోరారు.

న్యూస్ బాక్స్..

నేడు ఇస్కాన్ దీపోత్సవం

ధర్మవరం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక పాండురంగస్వామి వద్ద ఇస్కాన్ ఆధ్వర్యంలో కార్తీకదామోదర దీపోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ భక్తబృందం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్తీకమాసాన్ని పురష్కరించుకుని ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నాలుగు వేలమందితో దీపాలు వెలగించబోతున్నామని, కావున భక్తులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అసభ్యకర పోస్టులు పెట్టకండి

ఓబుళదేవరచెరువు, నవంబరు7(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఎవరైనా ప్రభుత్వంపైగానీ, ప్రభుత్వ వ్యక్తులపైగానీ, మహిళలపైగానీ అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బీ. మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... అసభ్యకరమైన పోస్టులు ఫార్వార్డ్ చేసినా వారితోపాటు గ్రూప్ అడ్మిన్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరిపైనైనా కేసు నమోదైన వెంటనే వారి ఫోన్ సీజ్ చేసి, వారిపై సైబర్ బుల్లీ సీడ్స్ కూడా ఓపెన్ చేస్తామని చెప్పారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయండి

ధర్మవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కదిరిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ రామకృష్ణనాయక్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ నాయకులతో కలిసి ఆహ్వాన కరపత్రాలను విడుదల చేసిన ఆయన మాట్లాడారు. అపార్ విషయమై ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా మున్సిపల్ కన్వీనర్ బిల్లే రామాంజినేయులు, యూటీఎఫ్ నాయకులు రాంప్రసాద్, హరిశంకర, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

● నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జంషీద్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభల పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఇందులో ఎంఈఓ వేమనారాయణ, ఉపాధ్యాయులు ఆయూబ్ ఖాన్, సోముశేఖర్, చంద్రనాయక్, సుధాకర్, పోతులయ్య, ఫైరోజ్‌బాషా, బాబునాయక్, లక్ష్మీనారాయణ, శివలక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు...

కదిరి అర్బన్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని విద్యార్థి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం విడుదల చేసిన వారు మాట్లాడారు. విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలవంబిస్తున్న విద్య వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నిర్వహించే ఈసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వేమయ్య, ఏఐఎస్ఎఫ్ నాయకులు మహేంద్ర, బన్నీ, మధునాయక్, చౌడప్ప, సాహీద్, విజయ్ ఫయాజ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విజయ్ తరుణ్

ధర్మవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారుడు విజయ్‌తరుణ్ ఎంపికయ్యాడు. అనంతపురంలోని గత నెల 21న నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా బాస్కెట్ బాల్ పోటీల్లో ఇతను ప్రతిభ చాటాడు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి అనంత జట్టు తరపున పాల్గొంటారు. అతన్ని బాస్కెట్‌బాల్ అసోషియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి అసోషియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్ గురువారం అభినందించారు.


ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఓబుళదేవరచెరువు, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబల్లిలో గురువారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. బ్యాంక్ మేనేజర్ రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్యాంక్ ఖాతా ఉన్న ప్రతి ఒకరు కేంద్రం అందిస్తున్న బీమా పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అక్షరాస్యత కౌన్సిలర్ లక్ష్మణ, వ్యాపార ప్రతినిధి నాగరాజు, నరసింహులు, అశోక్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఆదాయం పెంచండి

ధర్మవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పన్నుల బకాయిలను వసూళ్లు చేసి మున్సిపాలిటీ ఆదాయానికి కృషి చేయాలని కమిషనర్ ప్రమోద్‌కుమార్ సిబ్బందికి సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, అమెనిటీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో ఆస్తిపన్ను రూ.13.77కోట్లు, నీటిపన్ను 8.88కోట్లు, ఖాళీస్థలాల పన్ను రూ.90 లక్షలు ఉన్నాయని, వీటిని సకాలంలో వసూళ్లు చేయాలని అన్నారు.

నియామకం



రాఘవేంద్ర

కదిరి అర్బన్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన వంకదార రాఘవేంద్రను నియమించారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర అధ్యక్షుడు షబ్బరి వరప్రసాద్ నుంచి నియామక పత్రం అందుకున్నట్లు ఆయన చెప్పారు.

వార్డు కమిటీ ఏర్పాటు

ధర్మవరం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టడానికి.. వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి పట్టణంలోని 25వ వార్డులో కమిటీని గురువారం ఏర్పాటు చేశారు. ఈ కమిటి ఛైర్మన్‌గా ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు, సభ్యులుగా సచివాలయ అడ్మిన్ సాయిప్రకాశ్, పాఠశాల హెచ్ఎం నాగప్ప, గ్రామ సమైక్య సభ్యురాలు పుష్పలత, ఏఎన్ఎం కాత్యాయని, అంగన్‌వాడీ కార్యకర్త తులసమ్మ, రక్షిత, కన్వీనర్‌గా మహిళా పోలీసు ఉమాదేవి ఉన్నారు.

సీజీపీ కళకళ

- నీరుంటే మండలం సస్యశ్యామలం..
- ప్రాజెక్టు నిండటంపై రైతుల హర్షం
- పదేళ్లలో ఇది మూడోసారి..
- హంద్రీనీవా నీరు మళ్లిస్తే నిత్యం జలకళే
- ప్రకటనలకే పరిమితమైన గత ప్రభుత్వం



నిండు కుండలా ఉన్న సీజీ ప్రాజెక్టు

తనకల్లు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల జీవనాడి చెన్నరాయస్వామి గుడి ప్రాజెక్టు (సీజీపీ). మండలంలోని ముండ్లపల్లి వారి సమీపంలో పాపాగ్ని నదిపై ఈ ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టు కింద 900 ఎకరాల సాగుభూమి ఉంది. దిగువ ప్రాంతంలో ప్రాజెక్టు ఊట నీటితో మరో రెండు వందల ఎకరాలపైగా భూమి సాగు అవుతుంది. అంటే మొత్తం 1100 ఎకరాల్లో వరి పంట సాగుచేస్తారు. ప్రాజెక్టు ఒకసారి నిండితే మండలంలోని 17 పంచాయతీలకు గాను.. 11 పంచాయతీలకు సాగు-తాగు నీటికి కొదవ ఉండదు. ప్రాజెక్టులో నీరుంటే.. ఈతోడు, చిన్నరామన్నగారిపల్లి, తనకల్లు, కొక్కంటి, టి.సదుం, దిగువతొట్లిపల్లి, బాలసముద్రం పంచాయతీలు, నల్లచెరువు మండలంలోని ఓరవాయి, నల్లచెరువు పంచాయతీ లతోపాటు అన్నమయ్య జిల్లాలోని గూడుపల్లి, కాలువపల్లి పంచాయతీల్లోని వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరుగుతుంది. పంటలకు కావలసినంత నీరు పుష్కలంగా లభిస్తాయి. అలాంటి ప్రాజెక్టు ఈ సారి వర్షాలకు నిండింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పది సంవత్సరాల్లో ఇది నిండటం మూడో సారి మాత్రమే. ఇలా ఏటా ఈ ప్రాజెక్టుకు నీరు వస్తే.. చుట్టుపక్కల వందల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని రైతులు ఆకాంక్షిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు హంద్రీనీవా నీటిని మళ్లించాలనేది ఆ రైతులు దశాబ్దాల కోరిక.

● పట్టించుకోని పాలకులు..: ఈ ప్రాజెక్టుకు హంద్రీనీవా నీటిని మళ్లించడంలో పాలకులు విఫలమయ్యారు. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టులోకి రావలసిన హంద్రీనీవా కాలువ 20 కిలోమీటర్లు తిరిగి ప్రాజెక్టు కింద వెళ్లాల్సి వచ్చింది. దీంతో కాలువ నిండుగా ప్రవహిస్తున్నా, ప్రాజెక్టులోకి నీరు రాదు. ప్రాజెక్టుకు నీరు ఇస్తామన్న వైసీపీ ప్రభుత్వం... ఐదేళ్లపాటు ప్రకటనలతో కాలయాపన చేసింది. నాటి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి ఈ ప్రాజెక్టుకు సొంత నిధులతో కాలువ పనులు ప్రారంభించినా అవి ప్రారంభంలోనే ఆగిపోయాయి. నేటి ఎమ్మెల్యే కందికుంట ఈ ప్రాజెక్టుకు నీరు ఇచ్చి తీరుతామని హామీ ఇచ్చారు.

నీటి సమస్య ఉండదు



ఈ ప్రాజెక్టులో నీరుంటే తమ పంచాయతీలో తాగు, సాగునీటికి ఇబ్బంది ఉండదు. ఈ ప్రాంతమంతా పాడి పంటలతో కళకళలాడుతుంది. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తమ గ్రామం వద్ద నుంచి ప్రాజెక్టులో హంద్రీనీవా కాలువ వెళ్లేలా సర్వే చేయించారు. మధ్యలో వచ్చిన పాలకులు వారి స్వలాభం కోసం హంద్రీనీవా కాలువను అష్టవంకర్లు తిప్పారు. 20 కిలోమీటర్ల దూరంలో కాలువ తీసుకెళ్లి ఈ ప్రాజెక్టులోకి నీరు రాకుండా చేశారు.

-రెడ్డెం శ్రీనాథ్‌రెడ్డి, రైతు, చిన్నరామన్నగారిపల్లి

నాటి పాలకుల పాపమే



నాటి కాంగ్రెస్, వైసీపీ పాలకుల పాపామే సీజీపీకి శాపంగా మారింది. స్వార్థ రాజకీయాలతో ఈ ప్రాజెక్టుకు దూరంగా హంద్రీనీవా కాలువ వెళ్లేలా చేశారు. ప్రాజెక్టులో నీరుంటే తనకల్లు మండలంలో సాగు, తాగునీటికి కొరతే ఉండదు. అన్నమయ్య జిల్లాలోని పలు పంచాయతీలు, నల్లచెరువు మండలంలోని కొన్ని పంచాయతీల్లో భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయన్నారు.

-గోపాల్‌రెడ్డి, రైతు, ఎగువ తొట్లిపల్లి

త్వరలో పనులు ప్రారంభిస్తాం

సీజీపీకి హంద్రీనీవా కాలువ నీటిని ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మొగిలిచెట్లతండా వద్ద నుంచి కాలువ పనులు ప్రారంభిస్తాం. ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. టెండర్లు పిలిచాం. త్వరలోనే టెండర్లు ఖరారు చేసిన పనులు ప్రారంభిస్తాం.

- బయప్ప, ఏఈ, మైనర్ ఇరిగేషన్

పంటనీరు ప్రణాళికపై అవగాహన

తనకల్లు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లిరెడ్డిపల్లిలో గురువారం 2024-25కు గాను పంట, నీరు ప్రణాళికపై రైతులకు జనజాగృతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మల్లిరెడ్డిపల్లి, ఎర్రబల్లి, గొళ్లపల్లి నీటి పరివాహక ప్రాంతంలో ఈ ఏడాది పడిన వర్షపాతం, ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు, వాటికి ఉపయోగించిన నీరు, మూడు గ్రామాల్లో ఉన్న జనాభా, పశు సంపద, వాటికి ఏడాదికి అవసరమయ్యే నీరు, భూమికిలో ఇంకిన నీరు., నిలువ ఉన్న నీరు, తదితర విషయాలను గణాంకాలతో రైతులకు వివరించారు. ఖరీఫ్‌లో సాగుకు ఆరు హెక్టామీటర్ల నీరు అదనంగా నిలువ ఉన్నట్లు చెప్పారు. రైతులు బోర్ల, బావుల కింద రబీలో సాగుకు ఐదు హెక్టామీటర్ల నీరు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. పంటల సాగు విస్తీర్ణం తగ్గించుకోవాలని, లేదా పంట మార్పిడి చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనజాగృతి ఈడీ రాంప్రసాద్, సిబ్బంది చంద్రమోహన్, గరుడప్ప, కిరణ్‌కుమార్‌రెడ్డి, విశ్వనాథ్, హరినాయక్, శ్రీనాథ్‌రెడ్డి, ధరణీ, సుప్రియ, ఎర్రబల్లి, గొళ్లపల్లి, మల్లిరెడ్డిపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి

కొత్తచెరువు: స్థానిక వీఆర్ఏ వెట్టి రామన్న అనారోగ్యంతో గురువారం మరణించాడు. ఆయన మృతదేహానికి తహసీల్దార్ నీలకంఠారెడ్డి, గ్రామసేవకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు బాధిత కుటుంబానికి రూ.25 వేలు అందజేశారు. ఆర్ఐ కిరణ్, వీఆర్వోలు శ్రీనివాసులు, వేణు, మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు శివ, పెద్దన్న, ఓబుళప్ప, చెన్నయ్య నివాళులర్పించారు.

చెరువును సర్వే చేసిన అధికారులు

తాడిమర్రి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : తాడిమర్రి పడమటి చెరువును స్థానిక వీఆర్వో కుళ్లాయప్ప, మండల సర్వేయర్ ప్రశాంతి గురువారం సర్వే చేశారు. ఈ చెరువు ఆక్రమణకు గురవుతోందని మూడు నెలల కిత్రం ఫిర్యాదులు చేసినా ఎందుకు పట్టించుకోలేదని తాడిమర్రిలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో రైతులు అధికారులను నిలదీశారు. దీనిపై తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు వీఆర్వో, మండల సర్వేయర్ ఆ చెరువును సర్వే చేశారు. అయితే చెరువు విస్తీర్ణంలో సగం పిన్నదరి గ్రామ పంచాయతీలో.. సగం తాడిమర్రి గ్రామ పంచాయతీలో ఉండటంతో అధికారులు కొంత మేర సర్వే నిర్వహించి వెళ్లారు. కాగా చెరువులో అనధికారికంగా బోర్లు వేయడంతో పాటు అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు వేసుకుని మోటార్లు ఆడిస్తున్నారని, ఎందుకు వాటికి విద్యుత్ కనెక్షన్లు తొలగించలేదని రైతులు ఆదే గ్రామసభలో అధికారులు నిలదీశారు. అయినా విద్యుత్ అధికారులు మాత్రం తమకు ఏమీ పట్టనట్లుగా మిన్నకుండిపోయారు. ఈ విషయం అడిగేందుకు ఆంధ్రజ్యోతి ఫోన్‌లో ప్రయత్నించగా విద్యుత్ శాఖ ఏఈ స్పందించలేదు.

10న గుండె వైద్య శిబిరం

తనకల్లు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు గురువారం తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆ పాఠశాలలో విడుదల చేసిన వారు మాట్లాడారు. తాము ఈ పాఠశాలలో 1983న పదో తరగతి చదువుకున్నామని, 40 సంవత్సరాలు పూర్తి అవుతున్న నేపథ్యంలో తమవంతు సహకారంగా తనకల్లులో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతపురంలోని మార్చు ఆసుపత్రి సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఛాతిలో నొప్పి, ఆయాసం, కళ్లు తిరగడం, కాళ్లు వాపులు, చమటలు పట్టడం, తదితర వాటితో ఇబ్బంది పడుతున్న ప్రజలు చికిత్సలు చేయించుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చే రోగులు ఇప్పటి వరకు చూపించుకున్న రిపోర్టులు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లలితమ్మ, విశ్వనాథ్‌రెడ్డి, బాబుప్రసాద్, మాధవరెడ్డి, సురేష్‌మల్లి, దామోదర్‌రెడ్డి, జానకీరామ్, కేశవరెడ్డి, మురళీ పాల్గొన్నారు.

బోగస్ పత్రాలతో పరిహారం స్వాహా

కదిరి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి బైపాస్ రోడ్డుకు వచ్చిన పరిహారాన్ని బోగస్ పత్రాలతో ఎనిమిది మంది రూ.55 లక్షలు కాజేశారని గాండ్లపెంటకు చెందిన షేక్ రహంతుల్లా కదిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. సీఐ నారాయణ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గాండ్లపెంటకు చెందిన రహంతుల్లా పట్టణంలోని నిజాంవలీ కాలనీకి చెందిన తుమ్మల అమీనాబీ నుంచి మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 1781-3లో ఎకరా 40 సెంట్లు భూమిని కొనుగోలు చేశాడు. అందుకు రూ. 9.80 లక్షలు చెల్లించాడు. అదే సమయంలో కదిరి, మదనపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ జరిగింది. రహంతుల్లాకు చెందిన స్థలం ఒక ఎకరా 25సెంట్లు సేకరించారు. అందుకుగాను రూ.57 లక్షల పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఉపాధి రీత్యా రహంతుల్లా సౌదీ అరేబియాలో ఉండగా.. ఇదే అదునుగా భావించిన ఎనిమిది మంది బోగస్ పత్రాలు సమర్పించి, రూ.57లక్షల పరిహారం కాజేశారు. వారిలో ప్రధానంగా తుమ్మల అమీనాబీ, ఆయూబ్‌ఖాన్, హస్సేన్‌ఖాన్, ఇందయతుల్లాఖాన్, కలీల్ అహమ్మద్, ఇలాహి, దాదాపీర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మున్వర్ తదితరులున్నారు. విషయం తెలుసుకున్న షేక్ రహంతుల్లా అధికారులను, నిందితులను పలుమార్లు అడిగినా స్పందించలేదు. పైగా అంతుచూస్తామని బెదిరించడంతో షేక్ రహంతుల్లా.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ఆ ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

నంబులపూలకుంట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజపల్లిలో సర్వేనెంబర్ 998లో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి కొందరు యత్నిస్తున్నారని, దాన్ని అడ్డుకోవాలని ఆ గ్రామస్థులు తహసీల్దార్ నరేంద్రకుమార్‌కు గురువారం వినతిపత్రం అందచేశారు. అక్కడ కొంతమందికి పట్టాలివ్వగా... ఇంకా 15 సెంట్లు భూమి ఉందని, దాన్ని అర్హులైన పేదలకు ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే కొంతమంది కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఆ భూమిని కాపాడా పేదలకు పట్టాలివ్వాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ ప్రభుత్వ కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దమ్మ, శ్రావణి, రామక్రిష్ణ, ప్రభాకర్, రాము, శ్రీనివాసులు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

23న సాగునీటి సంఘం ఎన్నికలు

నంబులపూలకుంట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 23న మూడు సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నరేంద్రకుమార్, మైనర్ ఇరిగేషన్ ఏఈ మహేష్ తెలిపారు. వంకమద్ది, పెడబల్లి, ధనియాన్‌చెరువు ఆయకట్టు కింద రైతులకు సభ్యత్వం ఉంటుందన్నారు. ఆయకట్టు రైతులకు వన్‌బి తప్పనిసరి అన్నారు. ఈనెల 10న ఓటర్ల జాబితా ను సిద్ధం చేస్తామనీ, 12వతేదీ వరకు అభ్యంతరాలుంటే తెలిపాలని అన్నారు. తుది జాబితాను తహసీల్దార్, ఎంపీడీఓ, సచివాలయాల్లో ఉంచుతామన్నారు.

కొనసాగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లు

ధర్మవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ రెండో రోజైన గురువారమూ కొనసాగింది. ఈ టోర్నీలో ఐదు మ్యాచ్‌ల్లో పది జట్లు పాల్గొన్నాయి. ఎంజీ వారియర్స్ జట్టుపై బిగ్ డాడీస్ జట్టు, సంజయ్‌నగర్ జట్టుపై ఎర్రగుంట జట్టు, కత్తెకొట్టాల జట్టుపై మారుతీనగర్ జట్టు, గరుడంపల్లి జట్టుపై సీనియర్స్ జట్టు, టీపీఆర్ జట్టుపై డివైన్ జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్, తిరుఫిరోజ్ నిర్వాహకులు భరత్, సాయినాథ్, ఫయాజ్ పాల్గొన్నారు.

వయోజనులకు విద్య

తనకల్లు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగు కార్యాలయంలో వయోజనులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఒకటి నుంచి లక్ష వరకు సంఖ్యలను చదవడం, రాయడం, ఒకటి నుంచి 999 వరకు సంఖ్యల్లో 1.. 10, వందల స్థానలను గుర్తించడం. కరెన్సీ నోట్లును, నాణ్యాలను గుర్తించడం, భాగాలను సరిచేయడం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డెప్ప, వయోజన విద్య నోడల్ ఆఫీసర్, ఎంఈఓ కళ్యాణి, ఏపీఎం జయంతి, వెంకటనారాయణ, వయోజన విద్య శ్రీనివాసులు, వలంటర్లు, మహిళలు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: మండల సమాఖ్య కార్యాలయంలో మహిళాసంఘాల సభ్యులకు, యానిమేటర్లకు వయోజన విద్యాపై అవగాహన కల్పించారు. 19 సంవత్సరాలు పైబడిన వయోజనులను విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఇందులో వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ రవీంద్ర, ఎంఈఓ సురేష్‌బాబు ఎంపీడీఓ రాబర్టు విల్సన్, వయోజన విద్య ప్రతినిధి మధు, వెలుగు సీసీలు, మహిళాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సేవాభావం అవసరం

కొత్తచెరువు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావంతో మెలగాలని డీఈఓ కిష్టప్ప సూచించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా రూపొందించిన లోగోను స్కౌట్స్ మాస్టర్లు గిరిధర్, నాగరాజు గుప్తా ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి గురువారం ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ... భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు దేశభక్తిపై శిక్షణ ఇస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగరాజు, సభ్యులు నచిత్రకళ, పణిభూషణరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉచితంగా కేన్సర్ పరీక్ష

పుట్టపర్తిరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు ఇంటి వద్దకే వచ్చి వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తుందని జిల్లా ఎన్సీడీ ఆర్‌బీఎస్కే ప్రోగ్రాం డైరక్టర్ డాక్టర్ నివేదిత పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్ర పరిధిలోని ఎనుమలపల్లి వాసవీ పాఠశాల, జగరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం, అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ఏరియా కో-ఆర్డినేటర్‌కు సన్మానం



వెలుగు కో ఆర్డినేటర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ఓబుళదేవరచెరువు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్‌గా నియమితులైన కుచ్చె రవీంద్రను గురువారం మహిళాసంఘం సభ్యులు, వెలుగు సిబ్బంది ఘనంగా సన్మానించారు. మండల సమాఖ్య కార్యాలయంలో ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు వేణు, సోముశేఖర్‌రెడ్డి, చెన్నకేశవులు, రమణ, వేణుగోపాల్, చంద్రారెడ్డి, లక్ష్మి, జిల్లా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు పుట్టా ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఆకతాయికి దేహశుద్ధి



యువకుడికి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

ధర్మవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఓ ఆకతాయికి కాలనీ వాసులు గురువారం దేహశుద్ధి చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన షేక్ బాబ్‌జాన్ పనిమీద ధర్మవరానికి వచ్చాడు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు బాలికలకు చాక్లెట్ ఆశ చూపి అనభ్యకరంగా ప్రవర్తించసాగాడు. ఆ బాలికలను పాఠశాలకు దూరంగా ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లబోయాడు. గమనించిన తోటి విద్యార్థులు సమీపంలోని స్థానికులకు విషయాన్ని చెప్పడంతో.. వారు షేక్ బాబ్‌జాన్‌ను చెట్టుకు కట్టేసి.. దేహశుద్ధి చేసి.. పోలీసులకు అప్పగించారు.

అక్రమ లే అవుట్ల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బత్తలపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బత్తలపల్లిలో రియల్టర్లు విచ్చలవిడిగా అక్రమ లే అవుట్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై గురువారం నిబంధనలకు తూట్లు.. అక్రమ లే అవుట్లు పేరుతో ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన తహసీల్దార్ స్వర్ణలత అక్రమ లేఅవుట్లను పరిశీలించారు. భూయజమానులను పిలిపించి వ్యవసాయ భూముల్లో అనుమతి లేకుండా లే అవుట్లు వేయడం నేరమని, వెంటనే వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ షణ్ముఖ, వీఆర్ఓ ప్రతాప్ పాల్గొన్నారు.

టీచర్లకు శిక్షణ రద్దు చేయండి

నంబులపూలకుంట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ లీడర్ షిపు శిక్షణా తరగతులను రద్దు చేసి, నాన్ రెసిడెన్సియల్ పద్ధతిలో వేసవి సెలవుల్లో శిక్షణ నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న శిక్షణను వాయిదావేసి వేసవి సెలవుల్లో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు రామాంజులయాదవ్, జిల్లా కౌన్సిలర్ రమణనాయక్, శివయ్య, సందీప్, గోవర్ధన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రహీమ్, రామమోహన్, లాలుసాబ్, షఫీ,ముషీర్‌అమ్మద్, సుందర్శన్‌గోపాల్, రమణయ్య, వరలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

పరిగి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): హిందూపురం యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మహంతేష్, జిల్లా అధ్యక్షులు జీహెచ్‌బాబు అధ్యక్షతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ యూటీఎఫ్ అధ్యక్షురాలిగా సత్యవతి, ప్రధాన కార్యదర్శిగా సుల్తాన్, గౌరవాధ్యక్షుడిగా బాబాఫకృద్దీన్, ఉపాధ్యక్షురాలిగా శ్రీదేవి, కోశాధికారిగా నరసింహమూర్తి, కార్యదర్శులుగా మహంతేశ్వర, శంకరప్ప, మహ్మద్ షఫీ, సుకన్య, రామకృష్ణ, ఖాజావలి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా చలపతి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మరికొందరిని ఎన్నుకొన్నారు. ఎన్నికైన కమిటీ సభ్యులు మండలంలోని ఉపాధ్యాయ సమస్యల పట్ల పోరాటం చేస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూమకుంట 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ రూరల్ ఏఈఈ జబీవుల్లా తెలిపారు. ఇందువలన మండల పరిధిలోని గోళ్ళాపురం, తూమకుంట, చౌళూరు, సంతేబిదనూరు, బేవనహళ్ళి, ఊడుగులపల్లి, సంబీవరాయనపల్లి, నక్కలపల్లి, కిరికెర, బసవనపల్లి, దేవరపల్లి, కొటిపి, కగ్గల్లు, సుబ్బిరెడ్డిపల్లి, అప్పలకుంట, గ్రామాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పోలీసుల అదుపులో మట్కాబీటర్లు?

లేపాక్షి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో యథేచ్ఛగా మట్కా నిర్వహిస్తున్న ఇద్దరు బీటర్లను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసులు లేపాక్షిలో దాడులు నిర్వహించి, ఇద్దరు బీటర్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

వెంకటగిరిపాళ్యం రోడ్డుకు మరమ్మతులు

పెనుకొండ రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అమ్మవారిపల్లి నుంచి వెంకటగిరిపాళ్యంకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు పంచాయతీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గతనెల 23న రియల్టర్ల పాపం ప్రజలకు శాపం అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన జిల్లా పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి రియల్టర్లు కల్వర్టును మూసివేయడంతో రహదారిపై నీరు నిలిచిందని తేల్చారు. రహదారిలో నీరు నిలువ లేకుండా రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఆచార్య ఎన్జీ రంగా సేవలు మరువలేనివి



ఆచార్య ఎన్జీ రంగాకు నివాళులర్పిస్తున్న డీన్

మడకశిర రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినీదేవి పేర్కొన్నారు. వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్జీ రంగా జయంతి వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినీదేవి మాట్లాడుతూ.. వ్యవసాయ అభివృద్ధికి రంగా చేసిన సేవలు మరువలేనివన్నారు. అందుకోసం విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టారన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హిందూపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. పరిగి మండలం కొడిగేపల్లికి చెందిన అశ్వర్థనారాయణ, నర్సాపురంకు చెందిన శీన, రొద్దం మండలం శేషాపురంకు చెందిన షర్ఫుద్దీన్, పరిగి మండలం శీగుపల్లికి చెందిన నాగరాజు, సీతారాంపురంకు చెందిన గోవిందప్పతోపాటు హిందూపురం మోడల్ కాలనీకి చెందిన విజయ్, రియాజ్‌ఖాన్‌లు కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్నారన్న సమాచారంతో వారిపై దాడిచేసి 14బాక్సుల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మీదుర్గయ్య మాట్లాడుతూ.. కర్ణాటక మద్యం తీసుకొస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర రాష్ట్ర మద్యం ఇక్కడికి రావడానికి వీలులేదన్నారు.

వైశాలి జయశంకర్ రెడ్డి కుటుంబానికి పరామర్శ

పెనుకొండ రూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో వైసీపీ నాయకుడు వైశాలి జయశంకర్‌రెడ్డి తల్లి ఆల్లగడ్డ చెన్నమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ గొల్లపల్లి గ్రామానికి చేరుకుని, చెన్నమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించి సానుభూతి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి



కుటుంబీకులకు ఆర్థికసాయం అందజేస్తున్నదృశ్యం

పెనుకొండ రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రొద్దం ఎస్సీ కాలనీకి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు మల్లికార్జున అనారోగ్యంతో మృతిచెందడంతో టీడీపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు రొద్దంకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అంత్యక్రియల కోసం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవనాయుడు, మాజీ మండల కన్వీనర్ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌ను కలిసిన ఎమ్మెల్యే

మడకశిరటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను గురువారం విజయవాడలోని సచివాలయంలో టీటీడీ బోర్డు సభ్యులు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు కలిశారు. టీటీడీ బోర్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వెంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం మడకశిర నియోజకవర్గం అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో చర్చించినట్లు తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

పెరిగిన కూలీరేట్లు..

రైతులు విలవిల



ఇబ్బందుల్లో మొక్కజొన్న సాగుదారులు

- పంటల నూర్పిడి కోసం తంటాలు
- ఒక్కసారిగా రోజు కూలీ రూ.700కి పెరుగుదల

చిలమత్తూరు, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంటను నూర్పిడి చేసుకొని ఇంటికి తీసుకురావడం రైతులకు గగనమవుతోంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పంట కోతలకు బ్రేక్ పడింది. వర్షాలు ఆగిన వెంటనే ఒక్కసారిగా రైతులు పంట కోతలకు దిగడంతో ఉన్నట్టుండి వ్యవసాయ కూలీలకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం వేరుశనగ నూర్పిడి, మొక్కజొన్న కోతలతో పాటు రబీ పంటల సాగు ప్రారంభమైంది. సాధారణ సమయాల్లో మహిళా కూలీలకు రోజు కూలీ రూ. 300, పురుషులకు రూ. 500 ఉండేది. అయితే ఒకేసారి పనులు పెరిగి డిమాండ్ పెరగడంతో మహిళా కూలీలకు రోజు కూలి రూ. 450లకు, పురుషుల కూలి రూ.700కి పెరిగింది. దీంతో ఒక పక్క పెరిగిన కూలీ ఖర్చులు భరించలేక, మరోపక్క పండిన పంటను సకాలంలో కోసుకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పంట నూర్పిడి కోసం ఇబ్బందులు

పెరిగిన కూలీల ధరలతో రైతులు తంటాలు పడాల్సి వచ్చింది. ఈ తరుణంలో అధిక కూలీలు భరించలేక ఇంట్లో ఉన్న వారే పంటల కోతకు సిద్ధపడుతున్నారు. ఒకరిద్దరితో సాగు చేసిన పంటను సకాలంలో కోత కోసుకోలేకపోతున్నారు. దీంతో పంట పొలంలో కొంత.. ఇంట్లో కొంత ఉండిపోతోంది.

హార్వెస్టింగ్ యంత్రంతో ఊపిరి

కూలీల ధరలు పెరగడంతో పాటు పొలం పనులకు కూలీలు దొరకని పరిస్థితిలో తమిళనాడు నుంచి ఈ ప్రాంతానికి వచ్చిన హార్వెస్టింగ్ యంత్రం రైతులకు ఊపిరి పీల్చుకునేటట్లు చేసింది. ఈ యంత్రం మొక్కజొన్న పంటను అతి సులువుగా, అతి తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో నూర్పిడి చేస్తోంది. దాంతో ఈ యంత్రాలు మండలంలో పలు గ్రామాల్లో పంటనూర్పిడిలో బిజీబిజీగా ఉంటున్నాయి. ఈ యంత్రంతో ఒక ఎకరం మొక్కజొన్న పొలాన్ని కేవలం గంట సమయంలో కోత కోస్తోంది. ఏకంగా కంకి నుంచి గింజలను వేరుచేసి రైతులకు అందజేస్తుంది. దీంతో నరాసరి యంత్రం ఇచ్చిన గింజలను ఆరబెట్టుకొనేందుకు వీలవుతోంది. దీని ఖర్చు కూడా తక్కువగానే ఉంది. ఎకరం పొలం కోయడానికి రూ. 3500లుగా ఉంది. దీంతో కూలీల ఖర్చు, సమయం వంటివి గమనిస్తే అన్నీ ఆదా అవుతున్నాయి.



కొట్లోపల్లి వద్ద మొక్కజొన్న పంటను కోస్తున్న హార్వెస్టింగ్ యంత్రం

వ్యవసాయానికి అనుసంధానం చేయాలి..

వ్యవసాయంలో కూలీల డిమాండ్ బాగా పెరిగింది. రోజురోజుకు కూలీల ధరలు పెరిగిపోతున్నాయి. సాగు చేసిన పంటలను ఇంటికి తీసుకురావాలంటే కష్టంగా మారింది. ఎకరం మొక్కజొన్న పంటను కోసి నూర్పిడి చేసుకోవాలంటే సుమారు రూ. 10 వేల వరకు కూలీల ఖర్చు వస్తోంది. గతంలో ఎన్నడూ ఇంత పెద్ద ఎత్తున కూలీల ధరలు పెరగలేదు. దీంతో పంటసాగులో పెట్టుబడి పెరిగింది. వ్యవసాయ పనులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తే రైతులకు వెసులుబాటుగా ఉంటుంది.



సోమశేఖర్, రైతు, కొట్లోపల్లి

లేపాక్షి రహదారుల్లో మృత్యుమలుపులు

లేపాక్షి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి గ్రామాలకు వెళ్లే రహదారుల్లోని మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించకపోవడంతో అవి గుబురుగా పెరిగి రహదారి మూసుకుపోయి వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. ముఖ్యంగా లేపాక్షి నుంచి కంచిసముద్రం వెళ్లే రహదారిలో చెట్లు గుబురుగా పెరిగి రోడ్డుకు అడ్డంగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడడంలేదు. దీంతో ఈ రోడ్డులో రోజూ ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణించాలంటేనే వాహనదారులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు విషయం తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని కంచిసముద్రం, మానెంపల్లి, మైదుగోళం గ్రామస్థులు అంటున్నారు. మలుపులను సూచించే హెచ్చరిక బోర్డులు వేగనియంత్రికలు వంటివికూడా లేకపోవడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. చీకటిపడిన తర్వాత ఈ రోడ్డుగుండా వెళ్లాలంటే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ మలుపుల కారణంగా గతంలో పలువురు మృత్యువాత పడిన సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా మారిన కంచిసముద్రం మలుపు

హాస్టల్‌లో మాయ

- హాజరుపట్టీలో 125 మంది
- హాస్టల్‌లో ఉండేది 25 మందే..

గుడిబండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన బీసీ హాస్టళ్లలో లుకలుకలకు అంతేలేకుండా పోతోంది. గుడిబండ మండలం మందలపల్లి బీసీ హాస్టల్‌లో విద్యార్థుల హాజరుపట్టికలో ఎక్కువ మంది పేర్లను నమోదు చేసి, ప్రభుత్వ సొమ్మును వార్డెన్ కాజేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



బీసీ హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు ఈ కొద్దిమందే..

మందలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొంకల్లు, దిన్నేహట్టి, కురుబరపల్లి, వద్రహట్టి, మందలపల్లి తదితర గ్రామాల విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులలో పలువురి పేర్లను హాస్టల్ వార్డెన్ హాజరుపట్టీలో నమోదు చేసుకొంటున్నారని చెబుతున్నారు. అయితే ఈ విద్యార్థులు మాత్రం హాస్టల్‌లో ఉండటం లేదని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఉదయం విద్యార్థులతో బయోమెట్రిక్ వేలిముద్రలు:

కొంకల్లు, దిన్నేహట్టి, కురుబరపల్లి, వద్రహట్టి, గ్రామాల నుండి పాఠశాలకు వచ్చే విద్యార్థులను హాస్టల్ సిబ్బంది బీసీ హాస్టల్‌కు తీసుకెళ్లి ఉదయం బయోమెట్రిక్ వేలిముద్రలను వేయిస్తున్నారు. అయితే ఆ విద్యార్థులు బయోమెట్రిక్ వేసిన తరువాత పాఠశాలకు వెళ్లి సాయంత్రం తమ స్వగ్రామాలకు వెళుతున్నారు. హాస్టల్‌లో 125 మంది ఉంటున్నట్టుగా హాజరు పట్టీలో నమోదుకాగా, వాస్తవానికి సుమారు 25 నుండి 30 మందిదాకే ఉంటున్నారు. మిగిలిన విద్యార్థులు హాస్టల్‌లో ఉండటం లేదు. దీంతో ఆవిద్యార్థులకు ప్రభుత్వం నుండి వచ్చే నిధులను వార్డెన్ స్వాహా చేస్తున్నారని తెలుస్తోంది. బయోమెట్రిక్ వేసే విద్యార్థులకు చిక్కీలు, కోడిగుడ్లు ఇచ్చిసరిపెడుతున్నారు. ఉన్నతాధికారులు ఈహాస్టల్‌పై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దీనిపై ఏపీసీడబ్ల్యు గంగాధర్ మాట్లాడుతూ.. విషయం తన దృష్టికి రాలేదన్నారు. హాస్టల్‌ను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బిడ్డ ఆరోగ్యం తల్లి చేతుల్లోనే..

హిందూపురం అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి బిడ్డ తల్లి అందించే పౌష్ఠికాహారంతోనే పుష్టిగా ఉంటారని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ లింగణ్ణ పేర్కొన్నాడు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మండల న్యాయసేవా అధికార కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. తల్లి ఆహారపు అలవాట్లతో బిడ్డ ఆరోగ్యం ముడిపడి ఉంటుందన్నారు. ఎంత మంచి ఆహారం తల్లి తీసుకుంటే బిడ్డ అంత ఆరోగ్యంగా ఉంటుందన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి: డీసీహెచ్ఎస్

మడకశిరటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల నుంచి వైద్య సేవల కోసం వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్ అన్నారు. మడకశిర వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రిని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోజూ ఎంత మంది వైద్యసేవల కోసం వస్తున్నారో, వారికి ఎలాంటి సేవలు అందుతున్నాయో అడిగి తెలుసుకొన్నారు. వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వెంట డాక్టర్ శశిరేఖ ఉన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



క్యాన్సర్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

సోమందేపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డా.హరికుమార్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది క్యాన్సర్ రహిత సమాజం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై వివరించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల గుండా ర్యాలీగా వెళ్తూ నినాదాలు చేశారు. స్థానిక ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ మనోహర్, పర్యవేక్షకులురవీంద్ర, రత్నమ్మ, ప్రభాకర్ రాజు, అనీల్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

భార్యభర్తల వివాదం ..

నడిరోడ్డుపై భర్త వీరంగం

గోరంట్ల, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రధాన రహదారిపై బాలికల ఉన్నతపాఠశాల సర్కిల్‌లో ఓ భార్యాభర్త ఘర్షణ పడడంతో గురువారం ఉద్రిక్త పరిస్థితి నెలకుంది. ధర్మవరానికి చెందిన చంద్రశేఖర్, లక్ష్మీ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. చంద్రశేఖర్ కుటుంబం యేడాదిక్రితం గోరంట్లకు వచ్చి ఇక్కడే నివాసముంటోంది. భార్యభర్తల మధ్య వివాదం కారణంగా భార్య లక్ష్మీ ధర్మవరంలో ఉంటోంది. వారి పిల్లలు మొదట ఆరు నెలలు తల్లివద్ద ఉండగా, తరువాత తండ్రివద్దకు వచ్చారు. ఆ తర్వాత యేడాదైనా వారిని తిప్పి పంపలేదు. దీంతో వారి మధ్య చర్చలు ఫలించకపోవడంతో తల్లి కొంతమందితో వచ్చిగోరంట్ల బాలికల ఉన్నతపాఠశాలలో చదువుతున్న కుమార్తెను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించింది. ఆసమయంలో చంద్రశేఖర్ సోదరి గుర్తించి వారితో వాగ్వివాదం చేస్తూ అన్నకు సమాచారం అందించింది. దీంతో చంద్రశేఖర్ ఇనుప రాడ్‌తో అక్కడికి చేరుకుని, వీరంగం సృష్టించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని, స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

చిలమత్తూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):స్పెషల్ క్యాంపెయిన్ డేస్ కార్యక్రమంలో భాగంగా ఎన్నికల కమీషన్ నిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ యునస్ బాబు గురువారం తెలిపారు. ఈ నెల 9, 10, 23,24 తేదీల్లో ఈ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల చేర్పులు, మార్పులు చేసుకోవచ్చన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

పెనుకొండ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం మునిమడుగులో గ్రామసభ జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రామసభల్లో పాల్గొననున్న మంత్రి సవిత

స్థానిక ఆర్డీఓ ఆనంద్‌కుమార్ మునిమడుగు గ్రామంలో శుక్రవారం నిర్వహించే రెవెన్యూ గ్రామసభలో బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పాల్గొననున్నట్లు కన్వీనర్ శ్రీరాములు తెలిపారు. రైతులు భూసమస్యలేమైనా ఉంటే పరిష్కరించుకోవాలన్నారు.

రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్



రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

మడకశిర రూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లను ఇస్తున్నట్లు ఏపీఎంఐపీ డివిజనల్ అధికారి నరసింహప్ప తెలిపారు. మండలంలోని మణూరు, బుళ్ళసముద్రం, చీపులేటీ గ్రామాల్లోని రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహప్ప మాట్లాడుతూ ప్రభుత్వం ఐదు ఎకరాలులోపు ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీతో వీటిని అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల రైతులు సమీప రైతుసేవాకేంద్రాల్లో తమ పూర్తి వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. డ్రిప్ మంజూరైన రైతులకు ఆగ్రామానికి వచ్చి డ్రిప్‌ను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.